PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 24 | విజయవాడ, గురువారం 24 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50


Vol No | Vijayawada, Thursday 24 August 2023 | Rs



చందమామ నుంచి విక్రమ్ పంపిన తొలి ఫొటో



బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో చారిత్రక ఘట్టాన్ని వీక్షిస్తున్న ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్, మాజీ ఛైర్మన్ కిరణ్ కుమార్, ఇతర శాస్త్రవేత్తలు



మామా.. వచ్చేశాం!

చంద్రుడిపై కాలుమోపిన విక్రమ్ ల్యాండర్

చరిత్ర సృష్టించిన చంద్రయాన్ -3

చందమామ రావే... జాబిల్లి రావే .. అంటూ ఎంత పిలిచినా రాని మామ ఇంటికి మనమే వెళ్ళాం! 2008లో చంద్రయాన్-1తో మొదలైన ప్రయాణం జాబిలిపై విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా కాలు మోపడంతో విజయవంతమైంది. దీంతో అంతరిక్ష రంగంలో అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ నిలిచింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొదటి దేశంగా రికార్డు సృష్టించింది. చంద్రయాన్-3 విజయంతో దేశమంతా పండగ వాతావరణం నెలకొంది. తరతరాల నిరీక్షణ ఫలించడంతో 'మామా వచ్చేశాం' అంటూ భారతావని పులకించింది. చంద్రుడిపైకి మన ప్రయాణం అధికారికంగా 2008లో ప్రారంభమైనప్పటికీ, నిజానికి 60 సంవత్సరాల మన శాస్త్రవేత్తల కృషి ఇది! ఇస్రో ఆవిర్భావ దినాల్లో సైకిలుపై చిన్న రాకెట్ల ప్రయోగాల రోజుల నుండి చంద్రయాన్ దాకా సాగిన ప్రస్థానం అమోఘం. ఈ ప్రయాణం ఇంతటితో ఆగదు. మరింత ముందుకు సాగుతూనే ఉంటుంది! అంతరిక్ష రహస్యాల గుట్టు విప్పుతూనే ఉంటుందని చంద్రయాన్-3 ప్రయోగ విజయానంతరం మాట్లాడిన ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ఉద్ఘాటించారు. చంద్రుడిపైకి మానవ సహిత యాత్రను పూర్తిచేయాలి. అంగారక గ్రహానికి చేరుకోవాలి. ఇంకో ఎన్నో లక్ష్యాలున్నాయని ఆయన అన్నారు. చంద్రయాన్-3 విజయానికి కృషి చేసిన శాస్త్రవేత్తలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోడీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

● లోపలి పేజీలో.. ●

నవయుగపు తొలి పొద్దు



ఇది చారిత్రాత్మక ఘట్టం. ప్రతి భారతీయుడు వేడుకు చేసుకునే రోజు ఇది. ప్రతి ఇంటా సంబరాలే. ఇది భారతీయులతో పాటు సమస్త మానవాళి విజయం. ఇది నవ యుగపు తొలి పొద్దు.

– ప్రధాని నరేంద్ర మోడీ

ఆరు దశాబ్దాల కృషి



భారత్‌కు ఇది మహత్తరమైన రోజు. శాస్త్రీయ దృక్పథానికి, హేతుబద్ధతకు లభించిన విజయమిది. ఆరు దశాబ్దాలుగా నిబద్ధత, కఠోర శ్రమ, అంకిత భావంతో చేసిన కృషి, దార్శనికత ఫలించాయి. అద్వితయమైన ఈ ప్రయాణం ఇక ముందు ఇలాగే కొనసాగాలి.

– సీతారాం ఏచూరి, సిపిఎం ప్రధానకార్యదర్శి

అపూరూప విజయం



ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. దేశ ప్రజలందరూ గర్వించదగ్గ అపురూపమైన విజయం.

– ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

విస్తరణతో మరింత కాలుష్యం

- కాకినాడ కోరమాండల్ ఎరువుల పరిశ్రమ విస్తరణపై భిన్నాభిప్రాయాలు
- ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులకు దక్కని అవకాశం

● లోపలి పేజీలో.. ●

బోర్డు పరీక్షలు ఏడాదికి రెండు సార్లు

- 11, 12 తరగతుల విద్యార్థులకు రెండు భాషలు తప్పనిసరి
- అందులో ఒకటి దేశీయ, మరొకటి విదేశీ భాష
- ఎన్‌సిఇఆర్‌టి తుది పాఠ్యప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ విడుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

11, 12 తరగతుల విద్యార్థులకు రెండు భాషలు తప్పనిసరి చేస్తూ ఎన్‌సిఇఆర్‌టి జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సిఎఫ్) స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్‌సిఈఆర్‌టి బుధవారం తుది జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సిఎఫ్) విడుదల చేసింది. ఎన్‌సిఎఫ్ బోర్డు పరీక్షలను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించాలని సిఫార్సు చేసింది. సైన్స్, కామర్స్ వంటి స్ట్రీమ్‌లలోని సబ్జెక్టులను విద్యార్థులు ఎంచుకోవడానికి ఎటువంటి పరిమితి ఉండకూడదని పేర్కొంది.

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ ఛైర్మన్ కె కస్తూరిరంగన్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నియమించిన జాతీయ స్టీరింగ్ కమిటీ రూపొందించిన ఎన్‌సిఎఫ్ జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపి) 2020కి అనుగుణంగా ఉంది.

ఎన్‌సిఎఫ్ అనేది 3 నుండి 12 తరగతులలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఈ)కి అనుబంధంగా ఉన్న పాఠశాలల్లో బోధించే ఎన్‌సిఈఆర్‌టి పాఠ్యపుస్తకాల కోసం బెంచ్‌మార్క్‌లను, బోధన, అభ్యాస పద్ధతులు, పాఠశాలలు అనుసరించే మూల్యాంకన పద్ధతులను నిర్వచిస్తుంది. ఏది ఏమైనప్పటికీ, విద్య అనేది రాష్ట్ర సబ్జెక్ట్ అయినందున రాష్ట్ర విద్యా

మిగతా 5లో



సిఎం సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలతో ఎపి జెన్‌కో అధికారులు, ఎన్‌హెచ్‌పిసి అధికారులు

పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టులు కీలకపాత్ర

- పునరుత్పాదక ఇంధన రంగంలో మూడు ప్రాజెక్టులకు సిఎం జగన్ శంకుస్థాపన
- రెండు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఎపి జెన్‌కో, ఎన్‌హెచ్‌పిసి మధ్య ఒప్పందం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి /అవుకు

రాబోయే రోజుల్లో పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టులు కీలకమైన పాత్ర పోషిస్తాయని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో మూడు ప్రాజెక్టులకు తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్‌గా బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. రెండు పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఎపి జెన్‌కో, ఎన్‌హెచ్‌పిసి మధ్య ఒప్పందం జరిగింది. సిఎం వైఎస్.జగన్ సమక్షంలో ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో పెటుబడులకు అవకాశాలపై ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేశారు. నంద్యాల జిల్లా అవుకు మండలం జున్నూతల గ్రామంలో గ్రీన్‌కో సంస్థ ఆధ్వర్యంలో 2300 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుకు, పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలో 1,014 మెగావాట్ల (సోలార్ పవర్ 700 ఎం.డబ్ల్యు, విండ్ పవర్ 314 ఎండబ్ల్యు) ప్రాజెక్టుకు, బేతంచర్ల మండలం ముద్దవరం గ్రామంలో 2,000 మెగావాట్ల విండ్, సోలార్ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నంద్యాల జిల్లా యాగంటిలో వెయ్యి మెగావాట్లు, అనంతపురం జిల్లా కమలపాడులో 950 మెగావాట్లు మొత్తం 1,950 మెగావాట్ల సామర్థ్యంతో రెండు పిఎస్‌పిలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. నాలుగో ప్రాజెక్టు కింద ఎన్‌హెచ్‌పిసితో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. సోలార్ ప్రాజెక్టులు, విండ్ ప్రాజెక్టులు సమగ్రంగా పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టులతో అనుసంధానమవుతున్న తీరు గ్రీన్ ఎనర్జీలో విప్లవానికి దారితీస్తాయని పేర్కొన్నారు. ఇవి రాబోయే రోజుల్లో పర్యావరణాన్ని పరిరక్షిస్తాయని, విద్యుదుత్పత్తికి తోడ్పాటు ఇస్తాయని అన్నారు.

మన రాష్ట్రంలో 8,998 మెగావాట్ల సోలార్ అండ్ విండ్ పవర్ ఉత్పత్తి అవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణ, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్, సిఎస్ డాక్టర్ కెఎస్ జవహంరెడ్డి, ఎపి జెన్‌కో ఎండి కెవిఎస్ చక్రధరబాబు, ఎన్‌ఆర్‌ఇడిసిఎపి విసి ఎండ్ ఎండి ఎస్.రమణారెడ్డి, బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్, ఎన్‌హెచ్‌పిసి ఫైనాన్స్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ గోయల్, గ్రీన్‌కో వైస్ ప్రెసిడెంట్ ఎన్.శేషగిరిరావు, ఎఎం గ్రీన్ ఎనర్జీ బిజినెస్ హెడ్ సమీర్ మాథుర్, ఎకోరన్ గ్రీన్ ఎనర్జీ సిఎండి వై.లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

కరెంటు భారాలు, కోతలతో జనం విలవిల

- ట్రూ అప్ ఛార్జీల వడ్డన అక్రమం
- మోడీ విధానాలతో ప్రజలపై పెనుభారాలు
- 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సమరభేరి
- మెడికల్ సీట్ల అమ్మకం దుర్మార్గం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

కరెంటు భారాలు, కోతలతో రాష్ట్ర ప్రజానీకం విలవిలలాడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు, మూడు నెలలుగా కరెంటు బిల్లులు రెండు, మూడు రెట్లు అదనంగా వస్తున్నాయని తెలిపారు. సామాన్య ప్రజానీకం, బడ్డీకొట్టు వ్యాపారులు, చిన్నచిన్న పరిశ్రమలు నడిపేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో 2016 నుంచి 40 పైసల నుంచి రూపాయికిపైగా అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. దీంతో, గతంలో రూ.400 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.800 వస్తోందని చెప్పారు. గతంలో ఎవరో వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు అద్దెకు ఉంటున్నవారు చెల్లించాల్సి వస్తోందన్నారు. మరోపక్క రెండు నుంచి నాలుగు గంటలపాటు కరెంటు కోతలు విధిస్తున్నారన్నారు. దీంతో, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 230 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మోటార్లకు కరెంటు లేక ఖరీఫ్ పంటలకు ఇబ్బంది వస్తోందని తెలిపారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు అవసరమా? అని ప్రశ్నించారు. రూ.6 వేలు ఖరీదు చేసే మీటర్లను రూ.35 వేలకు కొనుగోలు చేసి ఆ భారం వినియోగదారులపై వేసేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. అదానీ, షిర్డీసాయి కంపెనీలకు లాభాలు చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, కరెంటు కోతలు నివారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లు సామాన్య ప్రజానీకానికి దక్కనీయకుండా ఎన్‌ఆర్‌ఐ, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా పేరుతో ప్రభుత్వమే అమ్ముకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఐదు మెడికల్ కాలేజీల ఏర్పాటును అంతా స్వాగతించామన్నారు. ఉన్న సీట్లలో 15 శాతం ఆలిండియా కోటాపోను మిగిలిన 85 శాతం సీట్లను మెరిట్ ప్రాతిపదికన ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. సగం సీట్లను ఎన్‌ఆర్‌ఐ, సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షలకు అమ్ముకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ జిఒలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారుమోడీ అధికారంలోకొచ్చాక 20 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా 11.50 శాతం ద్రవ్యోల్బణం పెరిగిందన్నారు. టమాటా, నూనె, పప్పుల ధరలు భారీగా పెరిగిపోయాయని చెప్పారు. రేషన్ కింద ఇచ్చే చక్కెర, నూనె, పప్పులు ఇవ్వడం లేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ రూ.120కు చేరాయని తెలిపారు. తాము అధికారంలోకొస్తే పెట్రోల్ రూ.40కు, గ్యాస్ సిలిండర్ రూ.400కు ఇస్తామని మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు సిపిఎం సమరభేరి యాత్ర సాగనుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీలు ఇవ్వనున్నామని, నాలుగో తేదీన మండల కార్యాలయాల వద్ద ధర్నాలు జరగనున్నాయని చెప్పారు. వీటిలో

మిగతా 2లో

25, 26 తేదీల్లో సిటిజన్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25, 26 తేదీల్లో సిటిజన్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహించాలని అధికారులను గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది టీమ్‌గా ఏర్పడి ఈ ప్రోగ్రామ్‌ను పూర్తి చేయాలని, సచివాలయ సిబ్బంది వారీ టీమ్‌ను లీడ్ చేస్తూ ప్రోగ్రామ్‌ను పూర్తి చేయాలని పేర్కొంది. ముఖ్యంగా ఇకెవైసి పెండింగ్ ఉన్న వారికి పూర్తి చేయాలని, సెప్టెంబరులో అందించనున్న వైఎస్ఆర్ చేయూత పథకం కోసం ఇకెవైసి తప్పనిసరి అని ఆ శాఖ తెలిపింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందాలంటే హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌తోపాటు ఇకెవైసి పూర్తి కావాల్సి ఉండగా, అందుకు భిన్నంగా అక్కడక్కడా ఈ ప్రక్రియ పూర్తికాకపోవడంతో సంక్షేమ పథకాలు కొందరికి అందడం లేదని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఆ శాఖ పేర్కొంది.



5 లక్షలు కాదు... 9,832 ఇళ్లే!

- 30న సామూహిక గృహప్రవేశాలు
- కాకినాడలో పాల్గొననున్న సిఎం జగన్

● లోపలి పేజీలో.. ●


ఓట్ల తొలగింపుపై పునఃపరిశీలన

- 30 వ తేదికి తుది నివేదిక
- సిఇసి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఓట్ల తొలగింపుపై పున:పరిశీలన చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మెమో జారీ చేశారు. జిల్లా ఎన్నికల అధికారులకు జారీ చేసిన ఈ మెమోలో 2022 జనవరి ఆరవ తేది నుండి ఇప్పటి వరకు చేసిన తొలగింపులన్నింటిని పున:పరిశీలన చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 30 వ తేది నాటికి ఈ ప్రక్రియను పూర్తిచేసి కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపాలని తెలిపారు. బిఎల్‌ఓలు 100 శాతం క్షేత్ర పరిశీలన జరపాలని, ఆ తరువాత ఇఆర్‌ఓలు కనీసం వెయ్యి తొలగింపులను పరిశీలించాలని పేర్కొన్నారు. ప్రతి శాసనసభ నియోజక వర్గంలో కనీసం 500 తొలగింపులను పరిశీలించేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు.ప్రతి నియోజకవర్గం లో కనీసం 100 తొలగింపులను జిల్లా కలెక్టర్ లేదా జిల్లా ఎన్నికల అధికారి స్వయంగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను పూర్తిచేసి సాధ్యమైనంత త్వరగా నివేదికను సిఇఓ కార్యాలయానికి చేర్చాలని ఆదేశించారు. కాకినాడ పట్టణంలో ఓటర్ల తొలగింపు నకు సంబంధించి కంప్యూటర్ల సెంటర్లు కేంద్రంగా ఫామ్ 7 దరఖాస్తులు వెలువెత్తుతున్నాయని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు బుధవారం లేఖ రాశారు. ఇదే విషయంపై కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమూడి వెంకటేశ్వరరావు సిఇఓకు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉంటే నియోజకవర్గాల్లో అర్హులైన ఓట్ల తొలగింపు అధికారపార్టీ కనుసన్నల్లో జరుగుతోందని, ఓటర్ల వెరిఫికేషన్ నిజాయితీగా చేయించాలని, నిబంధనలు అతిక్రమించిన అధికారులపై చర్యలు తీసుకో వాలంటూ ఈనెల 28న టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నారు.

ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు సిఆర్ రావు కన్నుమూత



వాషింగ్టన్ : భారత్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత గణాంక, గణిత శాస్త్రవేత్త కల్యంపూడి రాధాకృష్ణారావు (102) కన్నుమూశారు. అమెరికాలో ఉన్న ఆయన అనారోగ్యంతో బుధవారం తుదిశ్వాస విడిచారు. గణిత శాస్త్రంలో అందించిన సేవలకు గానూ స్టాటిస్టిక్స్ రంగంలో అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పద్మ విభూషణ్‌తో సత్కరించింది. సిఆర్ రావు 1920 సెప్టెంబరు 10న బళ్లారి జిల్లా హడగళిలో తెలుగు కుటుంబంలో జన్మించారు. తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు, నూజివీడు, నందిగామలో బాల్యం గడిచింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్‌సి, కొల్‌కతా యూనివర్శిటీలో ఎంఎ స్టాటిస్టిక్స్ చేశారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలోని కింగ్స్ కాలేజీలో 1948లో పిహెచ్‌డి పూర్తి చేశారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరి అదే సంస్థకు డైరెక్టరుగా ఎదిగారు. ఆయన 2020 సెప్టెంబరు 10న వందో పుట్టినరోజు జరుపుకున్నారు. అమెరికాలో స్థిరపడ్డారు.

సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తారా?

- లోకేష్‌కు గన్నవరం పోలీసుల నోటీసులు
- పలువురు టిడిపి నేతలకు కూడా...

ప్రజాశక్తి- గన్నవరం (కృష్ణా జిల్లా)



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తోపాటు పలువురు టిడిపి నేతలకు బుధవారం కృష్ణా జిల్లా గన్నవరం జోన్ డిఎస్‌పి జయసూర్య ఆదేశంతో హనుమాన్‌జంక్షన్ సిఐ నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ నోటీసులు జారీ చేశారు. నోటీసును క్రైం నెంబరు 141/ఎస్‌డిపిఓగా చూపారు. గన్నవరంలో జరిగిన యువగళం బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి రోజా, గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీలపై లోకేష్‌తోపాటు టిడిపి కృష్ణా జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర నాయకులు అయ్యన్నపాత్రుడు, మరికొంతమంది టిడిపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఈ నోటీసులో పేర్కొన్నారు. 'ఈ నెల 22న బహిరంగ సభలో లోకేష్, అయ్యన్నపాత్రుడు, మరికొంతమంది నేతలు సిఎంపైనా, మంత్రి రోజాపైనా, ఎంఎల్ఎలపైనా అవమానకరమైన, పరువు నష్టం కలిగించే, అపహాస్యం చేసే ప్రకటనలు చేశారు. సిఎం పదవి ప్రతిష్టను కించపరిచారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఎమ్మెల్యేలను డ్రాయర్‌తో నడిపించుకుంటూ కొట్టుకుంటూ తీసుకెళ్తామని దుర్భాషలాడారు. ఎవరూ ఏ వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం మనోభావాలను ప్రభావితం చేసే లేదా ఏదైనా చట్టాన్ని ఉల్లంఘించేలా నినాదాలు, ప్రకటనలు, ప్రదర్శనలు చేయకూడదు. సభలో మైక్‌లను అనుమతి ప్రకారం ఉపయోగించాలని పోలీసు అనుమతిలో పేర్కొన్నా దానికి భిన్నంగా ఎక్కువ సంఖ్యలో మైక్‌లు పెట్టారు. డిటిఎస్ మైక్ సిస్టం సౌండ్‌లతో అలజడి సృష్టించడం తప్పు కాదా? ఈ దృష్ట్యా మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలి' అని ఈ నోటీసులో పోలీసులు పేర్కొన్నారు. టిడిపి కృష్ణా జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు చేతికి నోటీసులు ఇచ్చి వెళ్లిపోయారు. దీనిపై కొనకళ్ల స్పందిస్తూ, తమ న్యాయవాదుల ద్వారా సమాధానం ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం ఒక పథకం ప్రకారం తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెడుతోందని, తమను ఇబ్బందులు పెట్టేందుకే ఈ విధంగా పోలీసులతో నోటీసులు జారీ చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి నేతలపై కొడాలి నాని, వల్లభనేని వంశీ వ్యక్తిగత విమర్శలు చేసినప్పుడు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు.



రష్యాలో విమాన ప్రమాదం

- వాగ్నర్ చీఫ్ సహా 10 మంది మృతి

మాస్కో: రష్యాలో జరిగిన ఒక ప్రైవేటు విమాన ప్రమాదంలో వాగ్నర్ చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్‌తో సహా 10 మంది మృతి చెందారు. ఈ విషయాన్ని రష్యా అత్యవసర పరిస్థితుల మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'మాస్కో నుంచి సెయింట్ పీటర్స్ బర్గ్ ప్రయాణిస్తున్న ప్రైవేట్ ఎంబ్రేయర్ లెగసీ విమానం ట్వెర్ ప్రాంతంలోని కుజెంకినో గ్రామ సమీపంలో కూలిపోయింది. విమానంలో ముగ్గురు సిబ్బందితో సహా 10 మంది ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం విమానంలో ఉన్నవారంతా మరణించారు' అని ప్రకటన తెలిపింది. ప్రైవేట్ సైన్యం వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై తిరుగుబావుటా ఎగురవేసిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని గంటల్లో ఈ తిరుగుబాటు ముగిసింది.

లోకేష్‌పై డిజిపికి పోసాని ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నారా లోకేష్ తనను హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారని, ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని ఎపి ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోసాని మురళీకృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం మంగళగిరిలో డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. లోకేష్ తనను టిడిపిలో చేరాలని పిఎ చైతన్య ద్వారా రాయబారం పంపారని అన్నారు. తను నిరాకరించినందున హాని తలపెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. లోకేష్ బండారం బయటపెట్టానని టిడిపి తనపై కుట్ర పన్నుతోందన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

'ఆ' వ్యాఖ్యల అర్థం అదికాదు

- 'ఉక్కు' అధికారుల వివరణ

ప్రజాశక్తి-ఉక్కు నగరం

సందర్శకుల పుస్తకంలో కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగేంద్ర నాథ్ సిన్హా రాసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకోవడంతో గందరగోళం చోటుచేసుకుందని వైజాగ్ స్టీల్ ప్లాంటు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. రెండు సంవత్సరాల పాటే విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ఉంటుందని ఆయన రాశారని పేర్కొంటూ కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు కేంద్రకార్యదర్శి 'మెనీ-2 ఇయర్స్' అని రాశారని, మెనీ, మెనీ అని రాయడానికి బదులుగా అలా రాశారని తెలిపారు. ఆ మేరకు చదివితే మెనీ, మెనీ ఇయర్స్ అవుతుందని పేర్కొన్నారు. మరికొన్ని సంవత్సరాల పాటు ఉత్పత్తి సాగాలన్నది ఆ వ్యాఖ్యల అర్థమని వివరించారు. సందర్శకుల పుస్తకంలో ఆయన 'ఐ థింక్ ఇట్ హాజ్ మెనీ-2 ఇయర్స్ ఆఫ్ ప్రొడక్టివ్ లైఫ్' అని రాశారు.

అప్పులపై వాస్తవాలు చెప్పాలి

- ఆర్థికశాఖకు యనమల లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులపై వాస్తవాలు చెప్పాలంటూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌కు బుధవారం లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వాన్ని మోసం చేస్తూ కాగ్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వం లావాదేవీలు చేసిందని విమర్శించారు. అప్పులు రూ.10 లక్షల కోట్లకు చేరాయని, దీనిపై ప్రభుత్వ పరంగా పూర్తి సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. 2014-19 టిడిపి పాలనలో రూ.1.39 లక్షల కోట్ల అప్పులు మాత్రమే చేసిందని తెలిపారు. దీనికంటే వైసిపి ప్రభుత్వం రెండున్నర రెట్లు ఎక్కువ చేసిందని అన్నారు. అసెంబ్లీ అనుమతి లేకుండా రూ.లక్ష కోట్లు అప్పులు చేసినట్లు కాగ్ తన నివేదికలో గణాంకాలతో సహా నిర్ధారించిందని పేర్కొన్నారు. ట్రెజరీతో సంబంధం లేకుండా కోట్ల మేరకు బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ఫాలోవర్ మన్విత్ కృష్ణారెడ్డికి టిడిపి వేషం వేసి విలేకరుల సమావేశం పెట్టించడం ఇందులో భాగమేనని పేర్కొన్నారు. ఈ అంశంపై ఏప్రిల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని అన్నారు.

స్మార్ట్ విలేజ్‌లు రావాలి

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో స్మార్ట్ సిటీలతోపాటు స్మార్ట్ విలేజ్‌లూ రావాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటి సిల్వర్ జూబ్లీ ఉత్సావాల్లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. విజన్‌తో తీసుకున్న నిర్ణయాలు, పాలసీలతో వచ్చిన ఫలితాలు ఇప్పుడు కళ్లముందు కనిపిస్తున్నాయని అన్నారు.

తెలంగాణ దేశంలో ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా ఆవిర్భవించడానికి గతంలో జరిగిన అభివృద్ధే కారణం అని చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎంతో అభివృద్ధి చేసినా 2004లో ఎన్నికల్లో తాము ఓడిపోయామని అన్నారు. ఎన్నికల్లో గెలవడం వేరు, అభివృద్ధి, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు నిర్వహించడం వేరు అని అన్నారు. అభివృద్ధిని, ఎన్నికల ఫలితాలను పోల్చిచూడనని చెప్పారు. ప్రజలకు అభివృద్ధి ఫలాలు చేరడం తనకు అత్యంత సంతృప్తినిస్తుందన్నారు. ఐటి నాలెడ్జ్ ఎకనామీకి బ్యాక్ బోన్ అవుతుందని గతంలో గుర్తించామని, అందులో భాగంగానే ఐటి సంస్థలను ప్రోత్సహించామని తెలిపారు. తాను స్థాపించిన సంస్థ టాప్ టెన్ సంస్థల్లో స్థానం పొందడం గర్వంగా ఉందని చెప్పారు. ఒలింపిక్ క్రీడలు కూడా నిర్వహించే సమర్థత దేశానికి ఉందని తాను నమ్ముతున్నాని చెప్పారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

పరిహారం ఇస్తేనే 'పోలవరం' పూర్తి

- ప్రశ్నార్థకంగా డ్యామ్ భద్రత
- సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- ఏలూరుకు చేరిన సిపిఐ బస్సు యాత్ర

ప్రజాశక్తి - ఏలూరుప్రతినిధి/అర్బన్

పోలవరం ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించినప్పుడే ప్రాజెక్టు పూర్తయినట్లని, నిర్వాసితులకు పరిహారం అందించకుండా గోదావరిలో ముంచేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం దారుణమని రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. 'రాష్ట్రాన్ని రక్షించండి- దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చేపట్టిన బస్సుయాత్ర బుధవారం ఏలూరు జిల్లా కేంద్రానికి చేరుకుంది. పోలవరం నిర్వాసితుల సమస్యలపై నగరంలోని టుబాకో మర్చంట్స్ కల్యాణ మండపంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టిడిపి నేత, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ, ప్రత్యేకహోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసితులకు ఇప్పటి వరకూ 22 శాతం మాత్రమే పరిహారం అందించారని, డ్యామ్ మాత్రం 70 శాతం పూర్తి చేశారన్నారు. నిధులు రాబట్టడంలో కేంద్రంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఒత్తిడి పెంచకుంటే పోలవరం నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రాజెక్టు డ్యామ్ ప్రమాదంలో పడిందని, ప్రపంచస్థాయి నిపుణులతో తనిఖీ చేయించి నష్టపరిహారాన్ని కాంట్రాక్టర్ల వద్ద వసూలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యంలో తొలిముద్దాయి మోడీ ప్రభుత్వమే అని విమర్శించారు.

కె.రామకృష్ణ మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసి నిర్వాసితులను గోదావరిలో ముంచారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.15 వేల కోట్లు కేటాయిస్తే నాలుగేళ్లలో నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యి రాష్ట్రం సస్యశ్యామలమయ్యేదన్నారు. పోలవరం నిర్వాసితులు 1.06 లక్షల కుటుంబాలుంటే కేవలం 20 వేల కుటుంబాలకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తామనడం దుర్మార్గమన్నారు. అనంతరం బస్సు యాత్ర జంగారెడ్డిగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా జెపి సెంటర్‌లో జరిగిన బహిరంగసభకు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు.

'ఉక్కు' ప్రయివేటీకరణను అంగీకరించం

- వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని, ప్రజలు, కార్మికులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి చెప్పారు. విశాఖలోని గ్రాండ్‌బే హోటల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2021-2022లో దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా 11.2 శాతంతో ఆంధ్రప్రదేశ్ అవతరించిందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, పరిశ్రమ, వ్యవసాయం, విద్యా వ్యవస్థ, ఆరోగ్య సంరక్షణ, సామాజిక న్యాయం, మహిళా సాధికారత అనే ఎనిమిది అంశాల్లో రాష్ట్రం ఎలా ప్రగతి సాధించిందో నివేదిక ద్వారా వెల్లడించారు. రుషికొండపై అన్ని అనుమతులూ తీసుకునే టూరిజం ప్రాజెక్టులు చేపట్టామని, ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితమన్నారు. ఆనందపురం మండలం తర్లువాడ కొండపై ఇటీవల తమ పార్టీ నేత విజయసాయిరెడ్డి జరిపిన పర్యటనకు, ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అక్కడ ఏదైనా ప్రాజెక్టు నిర్మాణం ప్రతిపాదన ఉందా? అన్న విషయాన్ని తాను జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో మాట్లాడగా అలాంటిదేమీ లేదని చెప్పారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు అదీప్‌రాజు, నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాసంస్థల్లో వసతులు పూర్తిచేయాలి

- అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజనలో భాగంగా షెడ్యూల్-13లో పేర్కొన్న విద్యాసంస్థల్లో త్వరితగతిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. షెడ్యూల్-13లో పేర్కొన్న విద్యాసంస్థల్లో జరుగుతున్న నిర్మాణ పనులతో పాటు రహదార్లు, విద్యుత్, నీటి వసతి, కాంపౌండ్ గోడలు నిర్మాణం వంటి పలు మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనుల ప్రగతిని ఆయన సమీక్షించారు. నిర్దేశిత గడువు ప్రకారం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.. ఇకపై ప్రతి నెలా ఆఖరి సోమవారం పనుల ప్రగతిని సమీక్షిస్తానని తెలిపారు. తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న ఐఐటి, తాడేపల్లి గూడెంలోని ఎన్ఐటి, విశాఖపట్నంలోని ఐఐపిఇ, ఐఐఎం, తిరుపతిలోని ఐఐఎస్ఇఆర్, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, కర్నూలులోని ఐఐఐటిడిఎం, విజయనగరంలోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, మంగళగిరిలోని ఎయిమ్స్, ఎన్టీఆర్ జిల్లాలోని ఎన్ఐడిఎం సంస్థల పనులు సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, జిఎడి ముఖ్యకార్యదర్శి ఎల్ ప్రేమ్‌చంద్రారెడ్డి, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె శ్యామలరావు, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ బిఆర్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలపై కమిషనరు అసత్య ప్రకటనలు

- నేటి నుంచి మండల కేంద్రాల్లో రిలే దీక్షలు
- గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పంచాయతీ, స్వచ్ఛభారత్ క్లాప్‌మిత్ర కార్మికుల వేతనాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరు అసత్య ప్రకటనలు మానుకోవాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పేర్కొంది. 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరు ప్రకటన అవాస్తవమని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి వెంకట్రామయ్య, ఎన్ నూర్‌మహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా డిపిఓ అధికారుల నుంచి గ్రామ పంచాయతీలలో అధికారుల వరకూ ఎటువంటి కదలిక లేదని, బుధవారం కూడా అనేక జిల్లాల్లో కార్మికులు ఆందోళనలో ఉన్నారని వివరించారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కార్మికులు ఆందోళన నిర్వహించారని వివరించారు. ప్రకాశం, కృష్ణా, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో పంచాయతీ కార్మికులు ప్రతిరోజూ నిరసన తెలుపుతున్నారని పేర్కొన్నారు. 15 రోజులుగా ప్రభుత్వం, అధికారుల ప్రకటనలు తప్ప కార్మికులకు వేతనాలు అందడం లేదని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 2022 అక్టోబరు నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని స్వయంగా కమిషనర్ సూర్యకుమారి ఒక ప్రకటనలో అంగీకరించారని పేర్కొన్నారు. వేతనాలు పది నెలలు నుంచి పెండింగ్‌లో ఉంటే ఎలా జీవించాలని ప్రశ్నించారు. చిత్తశుద్ధితో కార్మికుల వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ముందు సిఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ ప్రకారం సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, హామీల అమలుకు ఈ నెల 24 నుంచి 26 వరకు మండల కేంద్రాల్లో రిలే దీక్షలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్దయెత్తున పాల్గొని నిరసనలు తెలపాలని కోరారు.

నేడు మున్సిపల్ కార్మికుల మహాధర్నా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మున్సిపల్ కార్మికులకు విజ్ఞప్తి చేసింది. విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఈ కార్యక్రమం జరగనుందని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణ, కె ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని, సిపిఎస్ రద్దు తదితర హామీలను నాలుగున్నరేళ్లుగా అమలు చేయడం లేదని అన్నారు.

5 లక్షలు కాదు... 9,832 ఇళ్లే !

- 30న సామూహిక గృహప్రవేశాలు
- కాకినాడలో పాల్గొననున్న ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

తొలి విడతలో ఐదు లక్షల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తామని ప్రభుత్వం మొదటి నుంచీ చెప్తూ వస్తోన్న ఈ నెల 30న జరిగే ఈ కార్యక్రమంలో 9,832 ఇళ్లకే పరిమితం కానుంది. లేఅవుట్లలో కనీసం వంద ఇళ్లు పూర్తయి అన్ని రకాల సౌకర్యాలూ ఉన్న వాటిలోనే ప్రవేశం చేయించనున్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోటలోని 2వ వార్డులో ఆ రోజున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2,299 ఇళ్లను ప్రారంభించనున్నారు. అదే రోజున రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో ఎంపిక చేసిన లేఅవుట్లలో ఒక్కో మంత్రి మిగిలిన ఇళ్లను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇళ్ల పూర్తి, కార్యక్రమం నిర్వహణకు గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు ఐదేసి జిల్లాలను ఒకరు పర్యవేక్షిస్తున్నారు. గృహాలకు విద్యుత్, మంచినీరు సదుపాయం కల్పించాలని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఇళ్లకు నీలం రంగు, స్వాగత తోరణాలు, ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలని సూచించింది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 16,60,171 ఇళ్లను మంజూరు చేసింది. వీటిని పలు దశల్లో చేపడుతూ 2024 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. వీటిలో తొలుత ఐదు లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 4.87 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. అయితే, లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన అంతమాత్రంగా ఉంది. సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న ఇళ్లకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కొంతవరకు బాగానే కల్పించినా, జగనన్న లేఅవుట్లలో మాత్రం తీవ్ర వెనుకబాటు


శ్రీకాకుళం జిల్లాలో జలుమూరు మండలం లింగాలవలస లేఅవుట్‌ను సిద్ధం చేస్తున్న అధికారులు

కనిపిస్తోంది. శ్రీకాకుళం జిల్లాలో నెలకొన్న పరిస్థితే ఇందుకు ఉదాహరణ. జిల్లాలో ఇప్పటివరకు 29,094 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిలో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారు 23,745 మంది, జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారు 5,349 మంది ఉన్నారు. వీటిలో ఇప్పటివరకు 25,553 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని అధికారులు చెప్తున్నారు. ఇందులో సొంత స్థలాల్లో నిర్మాణం చేపట్టిన 21,820 ఇళ్లకు ఇవ్వగా, లేఅవుట్లలో కేవలం 3,127 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. తాగునీటి సౌకర్యం 25,266 ఇళ్లకు కల్పించారు. వీటిలో సొంత స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లు 22,480, లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకున్న ఇళ్లు 2,786 ఉన్నాయి. విద్యుత్, తాగునీటి సరఫరా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు పెద్ద ఎత్తున బిల్లులు బకాయిలు ఉండడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయన్న చర్చ నడుస్తోంది.

గతంలో నాలుగు పర్యాయాలు వాయిదా

సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు వాయిదా పడింది. 2022లో విజయదశమి రోజున నిర్వహిస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజైన డిసెంబర్ 21 చేపట్టాలని నిర్ణయించింది. గృహ నిర్మాణాల లక్ష్యం కనీసం సగం కూడా పూర్తి కాకపోవడంతో వాయిదా వేసింది.

ఈ ఏడాది మార్చి 22న ఉగాది సందర్భంగా అందరితో గృహ ప్రవేశాలు చేస్తామని ప్రకటించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, అనుకున్న లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తి పూర్తి కాకపోవడంతో మరోసారి వాయిదా వేసింది. ఐదు లక్షల ఇళ్లకు అన్ని రకాల మౌలిక వసతులూ కల్పించాలంటే మరింత జాప్యమవుతుందని భావించిన ప్రభుత్వం, పూర్తి స్థాయిలో సిద్ధమైన ఇళ్లను ఈ నెల 30న ప్రారంభించేందుకు సమయాత్తమవుతోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాల్లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం, అందులో భాగంగానే సామూహిక ఇళ్లనూ ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

పోరాటం తీవ్రతరం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)



ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాబోవు కాలంలో పోరాటాలు తీవ్రతరం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు తెలిపారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 923వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ అండ్ కన్‌స్ట్రక్షన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్టీలుప్లాంట్‌ను ప్రయివేటుకు, కాంట్రాక్టులకు ఇవ్వడాన్ని ఉక్కు కార్మికలోకం సహించదన్నారు. ఉక్కు సెగ దేశవ్యాప్తంగా వెళ్లిందని, రాష్ట్ర, దేశ ప్రజలంతా పెద్ద ఎత్తున పోరాటానికి మద్దతునిచ్చారని తెలిపారు. ఉక్కు ఉద్యమంలో నిర్వాసితులు, ప్రజలు, నిరుద్యోగ యువత పాల్గొనాలని కోరారు ఈ దీక్షలో కెఎస్ఎన్.రావు, ఎన్.రామచంద్రరావు, జె.అయోధ్యరాం, వై.మస్తానప్ప, జె.రామకృష్ణ, యు.రామస్వామి, కారు రమణ, సిహెచ్ సన్యాసిరావు, శ్రీను పాల్గొన్నారు.


టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళ్లర్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్

టంగుటూరికి సిఎం నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. బుధవారం ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జోగి రమేష్, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశం గరించదగ్గ నేత టంగుటూరి : మాజీ మంత్రి డొక్కా

ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు దేశం గర్వించదగ్గ నాయకుడని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి డొక్కా మాణిక్య వరప్రసాద్‌తోపాటు ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పిలుపుతో దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రకాశం పంతులు కీలకపాత్ర పోషించారని తెలిపారు. న్యాయశాస్త్ర కోవిదుడుగా మద్రాసులోని కోట్లు విలువ చేసే తన ఆస్తులను స్వాతంత్ర్య పోరాటం కోసం ఖర్చు చేశారని అన్నారు. ఆంధ్రా తొలి ముఖ్యమంత్రిగా మార్గదర్శకమైన పాలన అందించారన్నారు. కృష్ణా డెల్టా అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ నారాయణమూర్తి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో..

నిస్వార్థమైన రాజకీయవేత్తగా, దేశ స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన గొప్ప వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని టిడిపి నేతలు కొనియాడారు. ప్రకాశం పంతులు జయంతి వేడుకలు టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగాయి. ముందుగా ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు తదితరులు పూలమాలలతో నివాళులర్పించారు. బ్రిటీష్ వారితో ఆంధ్రకేసరి అని పిలిపించుకున్న మహనీయుడు టుంగుటూరి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు విజయకుమార్, బుచ్చిరామ్ ప్రసాద్, ఎవి రమణ, ధారు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కన్విక్షన్ బేస్ పోలింగ్‌తో 109 కేసుల్లో శిక్షలు

- డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నేర విచారణ నేపథ్యంలో కోర్టులకు సహాయకారిగా వుండేలా అమలు చేస్తున్న కన్విక్షన్ బేస్ పోలింగ్ విధానం సత్ఫలితాలను ఇస్తోందని డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది కాలంలో ఈ విధానంతో 122 కేసుల్లో 109 కేసులకు విచారణ పూర్తయి శిక్షలు పడ్డాయని అన్నారు. నెల్లూరు పట్టణంలో 2022లో జరిగిన దర్గా ముజావర్ హత్యకేసులో నిందితుడికి జీవితఖైదు విధించిన నేపథ్యంలో డిజిపి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దర్గా ముజావర్ హత్యకేసులో నిందితుడికి 11 నెలల్లో శిక్ష పడిందని అన్నారు. కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసేందుకు కన్విక్షన్ బేస్ పోలింగ్ విధానాన్ని గతేడాది నుండి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విధానంలో నేరాల తీవ్రతను గుర్తించిన పోక్సో లాంటి 122 కేసులను విచారించామన్నారు. 109 కేసుల్లో శిక్షలు పడ్డాయన్నారు. ఇందులో 39 జీవిత ఖైదు, మిగిలిన 66 కేసుల్లో ఏడేళ్ల నుండి 20 ఏళ్లదాకా శిక్షలు పడ్డాయని తెలిపారు.

ముగిసిన ఇఎపిసెట్ తొలిదశ కౌన్సెలింగ్

- 94,580 ఇంజినీరింగ్ సీట్ల భర్తీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇఎపిసెట్ తొలిదశ కౌన్సెలింగ్ ముగిసింది. మొత్తం 94,580 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని సెట్ కన్వీనర్ సిహెచ్ నాగరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 24 నుంచి నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఇఎపిసెట్‌లో మొత్తం 1,57,319 మంది విద్యార్థులు అర్హత సాధించగా, 1,03,171 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరిలో 1,02,575 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో 1,00,986 మంది 31,36,318 ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారు. రాష్ట్రంలో 253 కళాశాలల్లో 1,21,306 కన్వీనర్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 94,580 సీట్లు మాత్రమే తొలిదశ కౌన్సెలింగ్‌లో భర్తీ అయ్యాయి. 26,726 సీట్లు భర్తీ కాలేదు. స్పోర్ట్స్ ఆథారిటీ నుంచి ఫైనల్ మెరిట్ లిస్ట్ రాకపోవడంతో 530 మందికి సీట్ల కేటాయింపు పూర్తికాలేదు. 26 యూనివర్సిటీల్లోని కళాశాలల్లో7,455 సీట్లకు 1,642 సీట్లు, 221 ప్రైవేట్ కళాశాలల్లో 1,09,748 సీట్లకు 24,792, 6 ప్రైవేట్ యూనివర్సిటీల్లోని కళాశాలల్లో 4,103 సీట్లకు 3,811 సీట్లు చొప్పున భర్తీ అయ్యాయి. ఎక్కువ మంది విద్యార్థులు సిఎస్ఇ కోర్సులకు ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో 32,190 సీట్లు ఉండగా, 29,515 సీట్లు భర్తీ అయ్యాయి. ఇసిఇలో 23,612 సీట్లకు 18,967 సీట్లు, ఇఇఇలో 9,115 సీట్లకు 5,445 సీట్లు, సిఎస్ఇ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషన్ లర్నింగ్‌లో 8,840 సీట్లకు 7,531, మెకానికల్‌లో 8,702 సీట్లకు 7,531, సివిల్‌లో 7,055 సీట్లకు 3,356 సీట్ల చొప్పున భర్తీ అయ్యాయి. మిగిలిన 26,726 సీట్లను తరువాత కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామని తెలిపారు.

కరెంటు భారాలు, కోతలతో జనం విలవిల

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారువచ్చే నెలలో వామపక్షాల జాతీయ సదస్సు జరగనుందని చెప్పారు. విశాఖ ఉక్కు ఉద్యోగుల ఉద్యమం తరహాలో ప్రజలు ప్రత్యక్ష పోరాటంలోకి దిగాలని కోరారు. . పాడేరు మెడికల్ కాలేజీలో సీట్లు 75 శాతం గిరిజనులకే ఇవ్వాలని కోరారు. మెడికల్ సీట్లు అమ్ముకోవడం ఏ మాత్రమూ చెల్లబోదని, న్యాయస్థానంలో సానుకూలమైన తీర్పు వస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర హక్కులపై వైసిపి, టిడిపి నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. మోడీని చూసి ఎందుకు వణికిపోతూ మోకరిల్లుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడితే ఊరుకోబోమన్నారు. ఇప్పటికైనా బిజెపిని నిలదీయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలు సాధించడంలో విఫలమైన బిజెపి నాయకులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్ పాల్గొన్నారు.

విస్తరణతో మరింత కాలుష్యం

- కాకినాడ కోరమాండల్ ఎరువుల పరిశ్రమ విస్తరణపై భిన్నాభిప్రాయాలు
- ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులకు దక్కని అవకాశం
- భారీగా మోహరించిన పోలీసులు



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాలుష్యం వెదజల్లే పరిశ్రమలతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో ఆయా పరిశ్రమలు పర్యావరణాన్ని కాపాడుతూ కాలుష్యం లేని విధంగా చర్యలు తీసుకొని కార్యకలాపాలు సాగించాలని కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎరువుల పరిశ్రమ విస్తరణపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కలెక్టర్ కృతికాశుక్లా అధ్యక్షతన బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. సుమారు 200 మంది పోలీసుల బందోబస్తు మధ్య నాలుగు గంటల పాటు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో 39 మంది నేరుగా, 50 మంది రాతపూర్వకంగా అధికారులకు అభిప్రాయలను తెలియపరిచారు. తొలుత కలెక్టర్ మాట్లాడుతూ.. కోరమాండల్ సంస్థ ప్రస్తుతం ఏడాదికి 20.50 లక్షల టన్నుల ఎరువులను ఉత్పత్తి చేస్తోందని, దీన్ని విస్తరించి 30 లక్షల టన్నులకు పెంచాలనే ఆలోచనతో ఉందన్నారు. ఈ మేరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ.. కోరమాండల్ పరిశ్రమ విడుదల చేసే కాలుష్యంపై ప్రజలకు ఉన్న అనుమానాలను ప్రతినిధులు నివృత్తి చేయాలన్నారు. ఎంపి వంగా గీత మాట్లాడుతూ.. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడంతో పాటు కార్మికుల భద్రతపై దృష్టి పెట్టాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, మండల నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, ఎఐటియుసి జిల్లా నాయకుడు తోకల ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ..కాలుష్యం లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, స్థానికులకే ఉపాధి అవకాశాలు దక్కేలా చూడాలని, మత్స్యకారుల జీవన విధానానికి ఎటువంటి నష్టమూ కలగకుండా చూడాలని కోరారు. పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ.. కిరాయి జనాన్ని తీసుకొచ్చి అధికారేతర రాజకీయ పార్టీల ప్రతినిధులను, ప్రజా సంఘాల నాయకులను, నగర పెద్దలను వెనక్కు నెట్టి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. వాకలపూడి మాజీ సర్పంచ్ గింజల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కోరమండల్ అనుకున్న స్థాయిలో గ్రీన్ బెల్ట్ నిర్వహించడం లేదన్నారు. పర్యావరణ ప్రేమికుడు జెటి.రామారావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ప్రతినిధులు వివరించలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ ప్రతినిధులు, కాకినాడ ఆర్‌డిఒ సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రకాశం జిల్లా ఒంగోలు మండలంలో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దేవరంపాడులో, ప్రకాశం పంతులు జన్మించిన నాగులుప్పలపాడు మండలం వినోదరాయునిపాలెంలో ఆంధ్రకేసరి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. దేవరంపాడులో జరిగిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఒంగోలు కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధైర్యానికి, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనం ప్రకాశం పంతులు అని కొనియాడారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి.. ఈ ఏడాది చివరినాటికి నీళ్లు ఇస్తామని తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడారు.

యాత్రికులు గుంపులుగా వెళ్లాలి

- 'కంచె' అంశం 'వైల్డ్‌లైఫ్' పరిధి
- త్వరలోనే చిరుత, ఎలుగుబంటిని పట్టుకుంటాం : సిసిఎఫ్

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

తిరుమలకు కాలినడకన వెళ్లే శ్రీవారి యాత్రికులు గుంపులుగా వెళ్లాలని, ఈ ప్రాంతంలో సంచరిస్తోన్న చిరుత, ఎలుగుబంటిని పట్టుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నామని అటవీశాఖ సిసిఎఫ్ నాగేశ్వరరావు తెలిపారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఎర్రచందనం గోదాము ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే మూడు చిరుత పులులను బంధించామన్నారు. మరిన్ని చిరుతపులుల సంచారం నేపథ్యంలో దాదాపు 100 మంది అటవీ శాఖ సిబ్బంది అడవిలో విధులు నిర్వహిస్తున్నారని, 300 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఒకే చిరుత 50 ఛాయాచిత్రాలలో ఉన్నట్టుగా గుర్తించామన్నారు. యాత్రికులపై వన్యప్రాణులు దాడి చేయకుండా తిరుమల కాలినడక మార్గంలో కంచె ఏర్పాటు చేయడం అనే అంశం వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా పరిధిలోనిదని చెప్పారు. అడవిలో వన్యప్రాణులకు ఎటువంటి హాని కలగకుండా వారు తగిన మార్గదర్శకాలను జారీ చేస్తూ కంచె ఏర్పాటుకు ప్లాన్ ఇస్తారని వివరించారు. జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. వన్యప్రాణుల నుండి శ్రీవారి యాత్రికులకు ఎటువంటి హాని కలగకుండా అటవీ శాఖ, టిటిడి చేపడుతున్న నిర్ణయాలకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఫారెస్ట్ కన్జర్వేటర్ శ్రీనివాస్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

వచ్చే మూడేళ్లలో రూ.30వేల కోట్ల పెట్టుబడులు

- 15,600 కిలోమీటర్ల పైపులైన్ల ఏర్పాటు
- జాతీయ గ్రిడ్ నిర్మాణం గెయిల్ ఛైర్మన్ వెల్లడి

న్యూఢిల్లీ : దేశీయ గ్యాస్ సరఫరా దిగ్గజం గెయిల్ (ఇండియా) వచ్చే మూడేళ్లలో రూ.30,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. పెట్రోకెమికల్ సామర్థ్యం విస్తరణ, గ్లోబల్ ఎల్‌ఎన్‌జి సరఫరాలో భారీ పెట్టుబడులు పెట్టనున్నామని ఆ సంస్థ ఛైర్మన్ సందీప్ కుమార్ గుప్తా తెలిపారు. బుధవారం జరిగిన కంపెనీ వార్షిక వాటాదారుల సమావేశంలో గుప్తా మాట్లాడుతూ.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెట్టామన్నారు.

"గెయిల్ క్రమంగా అభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను సృష్టిస్తోంది. ప్రధానంగా పైప్‌లైన్‌లు, కొనసాగుతున్న పెట్రోకెమికల్ ప్రాజెక్టులు, సిజిడి ప్రాజెక్టులు, ఆపరేషనల్ క్యాపెక్స్, గ్రూప్ కంపెనీల్లో ఈక్విటీ సహకారం తదితరాలపై వచ్చే మూడేళ్లలో రూ.30,000 కోట్లు వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. 15,600 కిలోమీటర్ల పైప్‌లైన్‌లు ఆపరేషన్‌లో ఉన్నాయి. దాదాపు 4,200 కిలోమీటర్ల పైప్‌లైన్‌లు నిర్మాణంలో ఉన్నాయి. వచ్చే ఏడాదిలో దాదాపు 20,000 కిలోమీటర్ల జాతీయ గ్యాస్ గ్రిడ్‌ను పూర్తి చేయనున్నాము. 160 కి.మీ గురుదాస్‌పూర్-జమ్మూ మార్గంలో సహజ వాయువు పైప్‌లైన్ వేయడానికి, నిర్మించడానికి, నిర్వహించడానికి లైసెన్స్‌ను దక్కించుకున్నాము. జగదీష్‌పూర్-హల్దియా- బొకారోలో అంతర్భాగంగా బరౌని-గౌహతి పైప్‌లైన్ (బిజిపిఎల్) విభాగం ద్వారా 729 కిలోమీటర్ల మేర ఉత్తర, ఈశాన్య ప్రాంతాలకు సహజ వాయువును సరఫరా చేయనున్నాము." అని గుప్తా తెలిపారు. భారత్‌లో పెరుగుతున్న పెట్రోకెమికల్ డిమాండ్‌తో, వచ్చే దశాబ్దంలో పెట్రోకెమికల్స్‌లో పెరుగుతున్న ప్రపంచ వృద్ధిలో భారత్ 10 శాతానికి పైగా దోహదం చేస్తుందని గుప్తా పేర్కొన్నారు.



సైకిల్‌యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న గేయానంద్

ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్సీ గేయానంద్
- తాడిపత్రిలో ఎస్‌ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ప్రభుత్వ విద్యను కాపాడాల్సిన ప్రభుత్వమే అందుకు విరుద్ధంగా కొత్తకొత్త నిర్ణయాలతో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ విమర్శించారు. అనంతపురం జిల్లాలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ 30 వరకు జరగనున్న ఎస్‌ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రను తాడిపత్రిలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద గేయానంద్ జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం మూసివేస్తూ పేదలను విద్యకు దూరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, కెజిబివిల్లో ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేరని తెలిపారు. ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు పోరాటాలే మార్గమని అన్నారు. ఇందు కోసం ఎఎస్‌ఎఫ్ఐ చేస్తున్న సైకిల్‌యాత్ర అభినందనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి.రమేష్ జిల్లా అధ్యక్షులు శివ, విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు నంద్యాల రోడ్డు మీదుగా మండలంలోని చుక్కలూరు, ఇగూడూరు, యాడికి, రాయలచెరువు, కృష్టిపాడు, గుత్తికి యాత్ర చేరుకుంది. సైకిల్ యాత్రకు అన్ని ప్రాంతాల్లోనూ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న శ్రీనివాసరావు, వెంకట్రావు తదితరులు

'కాలంపై కవాతు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : ప్రజాశక్తి జర్నలిజం కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఉన్నం వెంకటేశ్వర్లు రచించిన 'కాలంపై కవాతు' పుస్తకాన్ని గుంటూరు జిల్లా తాడేపల్లి సుందరయ్యనగర్‌లోని ఆయన స్వగృహంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య, ప్రజాశక్తి అసిస్టెంట్ ఎడిటర్ కె.గడ్డెన్న, హైకోర్టు న్యాయవాది కృష్ణమూర్తి, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పి.గిరిజ, వి.ఉష పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా)

తాము సాగుచేసుకుంటున్న ఎల్‌టిఆర్, 1/70, పోడుభూములకు పట్టాలివ్వాలని ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కెఆర్‌పురం ఐటిడిఎ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం గిరిజనులు ఈ కార్యక్రమం చేపట్టారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడారు. తరతరాలుగా గిరిజనులు సాగుచేస్తున్న ఎల్‌టిఆర్, 1/70, పోడు భూములకు పట్టాలివ్వాలని అనేక ఆందోళనలు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదన్నారు. కౌలు చేస్తున్న గిరిజనేతరుల పేర్లను మాత్రం అడంగల్‌లో నమోదు చేయడం దుర్మార్గమన్నారు. గిరిజనేతరులకు ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చే అధికారం ఆర్‌డిఒకు లేదని చెప్పిన వారే అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. మర్లగూడెంలో గిరిజనులు సాగుచేస్తున్న భూములకు ఆర్‌డిఒ ప్రొటెక్షన్ ఇవ్వడం, వాటి ఆధారంగా గిరిజనేతరులు పోలీసుల సమక్షంలో గిరిజనులపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. గిరిజనేతరులకు జీలుగుమిల్లి తహశీల్దార్ తప్పుడు ప్రొటెక్షన్ ఇస్తున్నారని విమర్శించారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజకు వినతపత్రాన్ని అందించారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో పర్యటించి గిరిజనులకు న్యాయం చేస్తానని పిఒ హామీఇచ్చారు.



కెఆర్‌పురం ఐటిడిఎ ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

నిర్మాణ రంగానికి పరిశ్రమ హోదా

- యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ

ప్రజాశక్తి - గన్నవరం

తాము అధికారంలోకి వస్తే నిర్మాణ రంగానికి పరిశ్రమ హోదా కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం కృష్ణా జిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో కొనసాగింది. 192వ రోజున ఉంగుటూరు మండలం చినఅవుటపల్లి ఎస్‌ఎం కన్వెన్షన్ హాలు వద్ద ఎపి భవన నిర్మాణదారులు, కార్మిక సమాఖ్య ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మిక సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ నిర్మాణరంగం, దాని అనుబంధ పరిశ్రమలైన స్టీలు, సిమెంటు, టైల్స్, టింబర్, వైర్లు తదితర 250 రంగాలకు ఊతమిచ్చి, లక్షలాది కార్మికులకు ఉపాధి కల్పిస్తోందని చెప్పారు. వ్యవసాయం తర్వాత నిర్మాణరంగంపైనే అత్యధికంగా జీవనం సాగిస్తోందని అన్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్రంలో తీవ్రంగా నష్టపోయింది నిర్మాణరంగమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక వెలుగు వెలిగిన ఈ రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. లోకేష్ స్పందిస్తూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మాణ రంగానికి పరిశ్రమ హోదా కల్పింస్తామని తద్వారా బ్యాంకు రుణాలకు అవకాశం లభిస్తుందని చెప్పారు. ఇది నిర్మాణ రంగానికి ఎంతో ఊతమిస్తుందని తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ లేదా టన్ను ఇసుక రూ. వందకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనివల్ల పేద, మధ్యతరగతి వారికి వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. ఆగిపోయిన అభివృద్ధి చక్రం మళ్లీ గాడిలో పడుతుందన్నారు. అనంతరం లోకేష్ చిన అవుటపల్లి నుండి పాదయాత్ర ప్రారంభించి ఆత్కూరు చేరుకున్నారు. అక్కడ కోఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగులతో, పొట్టిపాడుతో స్థానికులతో సమావేశమయ్యారు. పాదయాత్రగా అంపాపురం చేరుకుని శివారున ఏర్పాటు చేసిన విడిది కేంద్రంలో బస చేశారు.



భవన నిర్మాణదారులు, కార్మిక సమాఖ్య ప్రతినిధులతో మాట్లాడుతున్న నారా లోకేష్

సంపాదకీయం

ప్రజలకు పరపతి!

భారత రిజర్వ్ బ్యాంకు ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు చేపట్టిన ద్రవ్య సమీక్షలో కీలక రేట్లను యథాతథంగా ఉంచుతూనే ఆర్థిక వృద్ధి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ పాత్ర గురించి ఎప్పటి మాదిరిగానే ఆశావహంగా పేర్కొనడం సత్యదూరంగా ఉంది. రోజువారీ జీవితానుభవంలో ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందంటూ గొప్పలు చెప్పారు. అయితే, బ్యాంకుల నుండి పరపతికి నోచుకోని లేదా బ్యాంకు మెట్లు పదే పదే ఎక్కి దిగితే తప్ప పరపతి పొందలేని వారిని, స్వల్ప మొత్తాల రుణ గ్రహీతలను, ఇల్లు, వాహనం తదితర వ్యక్తిగత రుణాలు తీసుకునేవారి గురించి పట్టించుకున్నట్టు కనిపించింది. దాని వెనుక మర్మమేమిటో, సంబంధిత నిబంధనలు, మార్గదర్శకాలు ఎలా ఉంటాయో అవి ఆచరణలో ఎలా అమలుకు నోచుకుంటాయో వేచి చూడాల్సిందే! ప్రాధాన్యతారంగ రుణాలు, అందులో పంట రుణాలు, దళితులు, గిరిజనులు తదితర బలహీన వర్గాల వారికి మంజూరు చేయాల్సిన నిష్పత్తి వంటి అంశాలను రిజర్వు బ్యాంకు ఘనంగా పేర్కొన్నా ఆచరణ దిగదుడుపేనన్నది జగమెరిగిన సత్యం.

ద్రవ్య నియమాల్లో కీలకమైన రెపో రేటు 2020 మే నుండి రెండేళ్లపాటు 4 శాతం వద్ద స్థిరంగా ఉండగా 2022 మేలో 4.4 శాతానికి, అప్పటినుండి ప్రతి మూడు నెలలకూ ఎంతో కొంత పెంచుతూ ఈ ఏడాది ఫిబ్రవరికి దాన్ని 6.5 శాతానికి తీసుకెళ్లారు. కేవలం పది నెలల కాలంలోనే ఇంత భారీగా అంటే సుమారు మూడింట రెండు వంతుల పెరుగుదల అసాధారణం. గతంలో ఎన్నడూ ఇలా ప్రతి సమీక్షలోనూ పెంచుకుంటూ పోవడం జరగలేదని నిపుణులంటున్నారు. రెపో రేటు పెంపుతో ఫ్లోటింగ్ వడ్డీ రేటు నిబంధనల మూలంగా రుణగ్రహీతలు చెల్లించవలసిన వడ్డీ మొత్తం కూడా పెరిగిపోయింది. దాంతో గృహ వాహన తదితర వ్యక్తిగత రుణగ్రహీతలకు కిస్తీ (ఇఎంఐ)ల సంఖ్య లేదా ఇఎంఐ నగదు విపరీతంగా పెరిగాయి. పర్యవసానంగా బ్యాంకు రుణం అంటేనే సాధారణ మధ్యతరగతి ప్రజలు బెదిరిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎంతో కొంత నిలకడయిన ఆదాయం కలిగిన వారినందరినీ తిరిగి బ్యాంకులకు రప్పించడానికి, ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం తగ్గించడానికీ ఏం చెయ్యాలా అన్న ప్రయత్నంలో భాగంగానే ఫ్లోటింగ్ రేటు వడ్డీ విధానంపై చర్చను లేవనెత్తినట్టు కనిపిస్తోంది. రుణ గ్రహీతలకు నిబంధనలు వివరించి ఫ్లోటింగ్ లేదా స్థిర వడ్డీని ఎంచుకునే అవకాశంతో పాటు కిస్తీల సంఖ్యను, వాయిదా మొత్తాన్ని పునర్నిర్ణయించుకునేందుకు అనుమతించాలని తాజా ద్రవ్య సమీక్ష అనంతరం ఆర్‌బిఐ గవర్నర్ బ్యాంకులను ఆదేశించారు. నిజానికి ఆర్‌బిఐ పెంచిన రేట్ల మూలంగా రుణ గ్రహీతలకు వడ్డీ భారం పెరిగింది. ఆ వాస్తవాన్ని మరిపించి, రుణగ్రహీతల కోపాన్ని ఫ్లోటింగ్ రేటుపైకి నెట్టాలని తాజాగా ఆర్‌బిఐ, ప్రసార మాధ్యమాలు పూనుకోవడం దారుణం.

ఆదాయ వివరాల ఆధారాలు, అప్పు తిరిగి చెల్లించగలరన్న భరోసా కలిగించే విధమైన పత్రాలు లేదా ఏర్పాట్లు ఉంటే వారికి బ్యాంకుల నుండి నేరుగా డిజిటల్ పద్ధతిలోనే ఒక పరిమితి మేరకు రుణాలిచ్చేందుకు పథకాలను రూపకల్పన చేయాలని ఆర్‌బిఐ ఆదేశించింది. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణం పొందేందుకు ఒక పైలట్ ప్రాజెక్టును తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, యు.పిల్లో కొన్ని ఎంపిక చేసిన జిల్లాల్లో 2022 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. గుజరాత్‌లో డెయిరీ రైతులకు రుణాలిచ్చే పైలట్ పథకం ఇటీవలే ప్రారంభించారనీ వాటి అనుభవాలనుబట్టి విస్తృతపరచాలని ఆర్‌బిఐ పేర్కొంది. యుపిఐ లైట్ ద్వారా చిన్న మొత్తాల డిజిటల్ లావాదేవీలను పెంచాలంది. మొత్తంగా చూస్తే ఇదంతా బ్యాంకులంటేనే బెదిరిపోయేలా ఉన్న సామాన్యులను వాటికి చేరువ చేయడానికి, రికార్డుపరంగా వారిని ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములను చేయడానికి ఉద్దేశించిన ప్రయత్నాలని అనిపిస్తోంది. ప్రజలందరికీ అవసరమైన పరపతిని అందజేయడం, వారివద్దనున్న పొదుపు మొత్తాన్ని సరసమైన వడ్డీతో తిరిగి భద్రంగా చెల్లించడం బ్యాంకుల పరమావధిగా ఉండాలి. ఈ ప్రక్రియలు సజావుగా సాగేందుకు ఆర్‌బిఐ, ప్రభుత్వం కాపలాదారుగానూ అవసరమైన సందర్భాల్లో నియంత్రించేవిగానూ ఉండాలి. కానీ వాటిని గాలికొదిలేసి కార్పొరేట్ల సేవలో పాలకులు తరించిపోవడం క్షంతవ్యం కాదు.

మంచి మాట

అన్ని రకాల నైతిక, మత పరమైన, రాజకీయ, సామాజిక ప్రకటనల వెనుక, హామీల వెనుక ఏదో ఒక వర్గ ప్రయోజనం దాగి వుంటుంది. ఈ విషయం తెలుసుకోనంత వరకూ రాజకీయాల్లో ప్రజలెప్పుడూ మోసగించబడుతూ వుంటారు.
- వి.ఐ.లెనిన్

రాజకీయ ప్రయోజనాల కోసమే కొత్త చట్టాలు

విమర్శ



బిల్లుల్లోని అంశాలపై ప్రజలతో సంప్రదింపులు, సిఫార్సుల కోసం 2020 మే లో నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేశామని సర్కారు చెబుతున్నది. అయితే సంప్రదింపుల ప్రక్రియ విధి విధానాలు, అభ్యర్థనల పరిశీలన, విశ్లేషణపై నిపుణుల సంఘం అనుసరించిన పద్ధతులపై ఇప్పటికీ స్పష్టత లేదు. అంతేకాకుండా నిపుణుల సంఘం ప్రభుత్వానికి చేసిన సిఫారసులను సైతం బయటపెట్టలేదు. దీంతో సరైన సంప్రదింపులు జరపకుండా, న్యాయ నిపుణుల సలహాలు, అభ్యంతరాలను పరిగణన లోకి తీసుకోకుండా కొత్త చట్టాలను తీసుకొస్తున్నారని విపక్షాల విమర్శ. రాజకీయ ప్రయోజనాల కోసమే వీటిని తీసుకొచ్చారని, ప్రభుత్వాన్ని విమర్శించే వారిని టార్గెట్‌గా చేస్తూ...ఎవరూ నోరెత్తకుండా చేయడానికి వీటిని దుర్వినియోగం చేసే ప్రమాదముందని చెబుతున్నాయి.

ఐపిసి, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొస్తోంది. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యగా పేర్లు పెట్టి లోక్‌సభలో ప్రవేశపెట్టింది. వాటిని పార్లమెంటరీ స్థాయీ సంఘం పరిశీలనకు పంపుతామని, ఆ తర్వాత పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప జేస్తామని ప్రకటించింది. ఈ బిల్లులు పార్లమెంటరీ ప్రక్రియల అనంతరం త్వరలోనే చట్టరూపం దాల్చే అవకాశముంది. 'బ్రిటీష్ నాటి కాలం చెల్లిన చట్టాలను ప్రక్షాళన చేస్తున్నాం. రాజద్రోహం వంటి చట్టాలను తొలగిస్తున్నాం.' అని పార్లమెంట్ సాక్షిగా ప్రభుత్వం వెల్లడించింది. కాగా, బిల్లుల్లోని అంశాలపై ప్రజలతో సంప్రదింపులు, సిఫార్సుల కోసం 2020 మే లో నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేశామని సర్కారు చెబుతున్నది. అయితే సంప్రదింపుల ప్రక్రియ విధి విధానాలు, అభ్యర్థనల పరిశీలన, విశ్లేషణపై నిపుణుల సంఘం అనుసరించిన పద్ధతులపై ఇప్పటికీ స్పష్టత లేదు. అంతేకాకుండా నిపుణుల సంఘం ప్రభుత్వానికి చేసిన సిఫారసులను సైతం బయటపెట్టలేదు. దీంతో సరైన సంప్రదింపులు జరప కుండా, న్యాయ నిపుణుల సలహాలు, అభ్యంతరాలను పరిగణన లోకి తీసుకోకుండా కొత్త చట్టాలను తీసుకొస్తున్నారని విపక్షాల విమర్శ. రాజకీయ ప్రయోజనాల కోసమే వీటిని తీసుకొచ్చారని, ప్రభుత్వాన్ని విమర్శించే వారిని టార్గెట్‌గా చేస్తూ...ఎవరూ నోరెత్తకుండా చేయడానికి వీటిని దుర్వినియోగం చేసే ప్రమాదముందని చెబుతున్నాయి. మరోవైపు పోలీసులకు కల్పిస్తున్న అధికారాలతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవని పేర్కొంటున్నాయి.



ఫిరోజ్ ఖాన్

రాజద్రోహాన్ని రద్దు చేసినా...

వలసవాద చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకువస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నది. ముఖ్యంగా ఐపిసి లోని 124 (ఏ) రాజద్రోహ చట్టాన్ని తొలగిస్తున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. అయితే ఇదే స్థానంలో 'భారతీయ న్యాయ సంహిత'లో 150 సెక్షన్‌ను మరింత కఠినంగా తయారు చేసినట్లు స్పష్టమవుతున్నది. అంతేకాకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) లోని అంశాలన్నీ కూడా కొత్త బిల్లులో వుంచారు. ఈ కొత్త బిల్లులో ఉన్న వేర్పాటువాదం అన్న మాటకు నిర్వచనం ఎక్కడా చెప్పలేదు. కొత్త బిల్లుల్లో చేసిందల్లా దేశద్రోహం లేదా రాజద్రోహం అన్న మాటను తొలగించడం మాత్రమే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసు అధికారాలు దుర్వినియోగమయ్యే ప్రమాదం....

గతంలో సిఆర్‌పిసి కింద అరెస్టయిన వ్యక్తిని గరిష్ఠంగా 15 రోజులు మాత్రమే పోలీస్ కస్టడీలో ఉంచుకునే అవకాశముండేది. కానీ కొత్త చట్టాల్లో చేసిన నేరాన్ని బట్టి 60 నుంచి 90 రోజుల దాకా కస్టడీని పొడిగించవచ్చు. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నేరం చేసి సంపాదించిన సొమ్ముతో కూడగట్టిన ఆస్తిగా విచారణాధికారి భావిస్తే వాటిని అటాచ్ చేసే అధికారం కూడా వారికి ఇచ్చారు. విచారణలో భాగంగా డిజిటల్ ఆధారాలైన ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను సీజ్ చేయవచ్చు. అంతేకాకుండా అండర్ ట్రయల్స్‌లో ఉండి సగం శిక్షను అనుభవించిన వారికి మాత్రమే తప్పనిసరి బెయిల్ పొందే వీలుంది. ఇలాంటివి దుర్వినియోగమయ్యే ముప్పు ఎక్కువగా ఉంది. దీంతో అధికారంలో ఉన్న వారు తమను వ్యతిరేకించే వారిని ఏదోలా శిక్షించే వెసులుబాటు లభించే అవకాశముంది. 'విపక్షాల నోరు నొక్కేయాలన్న ప్రధాన ఎజెండాతోనే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత బిల్లును తీసుకొచ్చింది.' అని ఇప్పటికే మాజీ న్యాయశాఖ మంత్రి కపిల్ సిబల్ విమర్శించారు. 'ఈ చట్టం పోలీసులకు క్రూరమైన అధికారాలను కట్టబెడుతున్నది.

వీటిని అధికార పార్టీలు రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుంటాయి' అని ఆరోపించారు. 'ఐపిసి, సిఆర్‌పిసి చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులు ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రమాదకరం. దీనివల్ల పోలీసు రాజ్యం ఏర్పడుతుంది.' అని సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ అభిప్రాయపడ్డారు.

హిందీ పేర్లతోనూ సమస్య

ఐపిసి, సిఆర్‌పిసి వంటి ఇంగ్లీష్ పేర్ల స్థానంలో సంస్కృతంతో కూడిన హిందీలో కొత్త చట్టాలకు ప్రభుత్వం పేరు పెట్టింది. హిందీ పేర్లు పెట్టడానికి ఇప్పటికే డిఎంకె తన వ్యతిరేకతను తెలియజేసింది. న్యాయ ప్రక్రియ అంతా ఇంగ్లీషులో సాగుతున్నప్పుడు చట్టాలకు హిందీ పేర్లు పెట్టడంవల్ల లాభమేమిటనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే దేశం మీద హిందీని బలవంతంగా రుద్దాలనే ప్రక్రియలో భాగంగానే హిందీలో పేర్లు పెడుతున్నారనే విమర్శలు సైతం వస్తున్నాయి. 'హిందీ పేర్లు పెట్టడం అర్థం లేని పని' అని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణన్ విమర్శించారు.

చట్టాల లక్ష్యం నెరవేరాలంటే...

నేరాలు జరగకుండా నియంత్రించడానికి శిక్ష అనేది అవసరం. అయితే నేరస్థుల్లో పరివర్తన తీసుకురావడమే ఆ శిక్ష లక్ష్యం కావాలి. ఎంత పకడ్బందీగా, కఠినంగా చట్టాలను రూపొందించినా...వాటిని అమలు చేస్తున్న వారి ఉద్దేశ్యమే చట్టాల లక్ష్యాలను నిర్దేశిస్తుంది. నిందితుల్లోనే కాదు..చట్టాలను అమలు చేసే వారిలో కూడా పరివర్తన వస్తేనే చట్టాల అసలు లక్ష్యం నెరవేరుతుంది. 'వంద మంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు గానీ ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదు' అనేది న్యాయ వ్యవస్థ ప్రాథమిక సూత్రంగా చెబుతుంటారు. అలాంటి పద్ధతిలో చట్ట వ్యవస్థ నిర్మాణమైతేనే ప్రజలకు న్యాయ వ్యవస్థ పైన నమ్మకం, విశ్వాసం ఏర్పడుతుంది. అయితే కొత్త చట్టాలు రూపొందించడంతో, కేసుల పరిష్కారంలో టైమ్ లిమిట్ పెట్టడంతోనే సత్వర న్యాయం అనేది సాధ్యం కాదు. కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలంటే ముందుగా కోర్టుల్లో న్యాయమూర్తులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి. కొత్త బిల్లుల రూపకల్పన అనేది పకడ్బందీగా జరగాలి. అందుకోసం సర్కారు మరింత కసరత్తు చేయాలి. పార్లమెంట్‌లో క్షుణ్ణంగా చర్చించాలి. విపక్షాలు, ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలి. ఆ తర్వాతే ముందడుగు వేయాలి.


/ వ్యాసకర్త సెల్: 9640466464 /

అమలుకు నోచని ప్రధాని పథకాలు


విశ్లేషణ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎర్రకోటపై ఆగస్టు 15వ తేదీన పదవసారి జాతీయ జెండా ఆవిష్కరిస్తూ, వెయ్యి సంవత్సరాలకు గుర్తుండే ప్రణాళికలు, పథకాలు అమలు చేశామని ప్రకటించారు. 2024 ఎన్నికల్లో గెలిచి మళ్లీ ఎర్ర కోటపై తానే జెండా ఆవిష్కరిస్తానని ప్రకటించారు. ప్రైవేటీకరించిన ఎర్రకోటలో ఆగస్టు ఉత్సవాలకు కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు కిరాయి చెల్లించింది. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్న మోడీ దేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపానని, 2025 నాటికి మూడవ ఆర్థిక వ్యవస్థగా 5 ట్రిలియన్ డాలర్లకు పెంపుదల చేస్తానని ప్రకటించారు. ప్రస్తుతం 3.72 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థలో ఉన్నాం. కరోనా నుండి దేశంలో పరిశ్రమలు, సేవారంగంలో కోట్ల ఉద్యోగాలు తగ్గిపోయాయి. ప్రపంచంలోని 195 దేశాలలో భారతదేశం అవినీతిలో 85వ స్థానంలో, సామాజిక పురోగతిలో 127వ స్థానం, సులభతర వాణిజ్యంలో 63వ స్థానం, ప్రపంచ ఆవిష్కరణలలో 40వ స్థానం, మానవ అభివృద్ధి సూచికలో 132వ స్థానంలో ఉన్నట్లు ప్రపంచ బ్యాంక్ ప్రకటించింది.

మోడీ ప్రభుత్వం గడిచిన 9 సంవత్సరాలలో 84 పథకాలను ప్రకటించింది. కానీ ప్రారంభించడమే తప్ప ఏ ఒక్క పథకం సమగ్రంగా అమలుకు నోచుకోలేదు. పట్టణ, గ్రామీణ ప్రజలకు ఆదాయాల పెంపు, బీమా సౌకర్యంతోపాటు ఉపాధి అవకాశాలు ఈ పథకాల ముఖ్య ఉద్దేశం. ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్ ఏర్పాటు ద్వారా దేశ అభివృద్ధికి ఆటంకం కల్పించారు. పైగా అమలుచేస్తున్న సంస్కరణల వలన దేశాభివృద్ధి నిలిచిపోవడమేకాక ఏటా 12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ రంగంలో పరిశోధనలు, మార్కెటింగ్ వ్యవస్థతో పాటు భూముల సేకరణ చేపట్టి కార్పొరేట్ల పరం చేశారు. దేశంలోని పరిశోధన కేంద్రాలన్నీ నిర్వీర్యం అయ్యాయి. టెక్నాలజీని ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాము. ఇక్కడి వాతావరణానికి సరిపడక వ్యవసాయ ఉత్పత్తులు దెబ్బతిన్నాయి. ప్రధాని మోడీ కాలంలో ఏటా రూ.4 లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతులు చేసుకుంటున్నాము. ముతక ధాన్యాల ఉపఉత్పత్తులు, వంట నూనెలు, పప్పులు, పంచదార, పత్తితో పాటు మాంసం కూడా దిగుమతి చేసుకుంటున్నాము. ప్రణాళికా సంఘం రద్దు కావడంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. దేశంలోని 7,935 పట్టణాలలో 37.70 కోట్ల ప్రజలను స్వచ్ఛ భారత్ పేరుతో అభివృద్ధి చేస్తామని అన్నారు. మేకిన్ ఇండియా పథకంతో దేశాన్ని మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా రూపొందించడంతోపాటు, డిజిటల్ ఇండియా పథకంతో స్కిల్డ్, అన్ స్కిల్డ్, శిక్షణ ద్వారా ఉపాధి కల్పన, సూపర్ కంప్యూటర్ల ఏర్పాటుకు ప్రకటించిన పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఏటా రూ.3.5 లక్షల కోట్ల విలువైన విద్యుత్ యంత్రాలు, విద్యుత్ యేతర పరికరాలను దిగుమతి చేసుకుంటున్నాము. వాస్తవానికి ఈ సరకులు దేశంలో ఉత్పత్తి చేయడానికి తగినంత ముడిసరుకు, మానవ వనరులు ఉన్నాయి. వీటిని వినియోగించకుండా ఇతర దేశాల నుండి దిగుమతులు చేసుకుంటున్నాం. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా పథకాలతో విదేశీ పెట్టుబడులు ఆకర్షించడానికి వనరులు కల్పిస్తున్నారు. దేశ పరిశ్రమలను మూసివేస్తున్నారు. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగంలో 100 శాతం 'విదేశీ సంస్థాగత పెట్టుబడి' రాబట్టి వారు లాభాలు తరలించుకుపోయే విధంగా విధానాలు రూపొందించారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ప్రకటించి అందుకను గుణంగా 15 పథకాలను ప్రకటించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి మౌలిక వసతుల కింద లక్ష కోట్ల పథకాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. కానీ అవేవీ అమలుకు నోచుకోలేదు. ఎయిర్ ఇండియా, బిఎస్ఎన్ఎల్, షిప్పింగ్ కార్పొరేషన్‌ను లాభాల్లోకి తెస్తానన్న ప్రభుత్వం వాటిని అమ్మకానికి పెట్టింది. ఆహార అభివృద్ధిలో వెనుకబాటుతనం వలన దేశంలో 25 కోట్ల మంది దారిద్ర్యంలో మగ్గుతున్నారు. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం పోషకత్వ భారత్) అస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి దిగజారుతున్నది. ఈ విషయం ప్రపంచబ్యాంకు, ప్రపంచ ఆర్థిక సంస్థ నివేదికలే చెబుతున్నాయి.



సారంపల్లి మల్లారెడ్డి



2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ప్రకటించి అందుకనుగుణంగా 15 పథకాలను ప్రకటించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి మౌలిక వసతుల కింద లక్ష కోట్ల పథకాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. కానీ అవేవీ అమలుకు నోచుకోలేదు. ఎయిర్ ఇండియా, బిఎస్ఎన్ఎల్, షిప్పింగ్ కార్పొరేషన్‌ను లాభాల్లోకి తెస్తానన్న ప్రభుత్వం వాటిని అమ్మకానికి పెట్టింది. ఆహార అభివృద్ధిలో వెనుకబాటుతనం వలన దేశంలో 25 కోట్ల మంది దారిద్ర్యంలో మగ్గుతున్నారు. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం పోషకత్వ భారత్) అస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి దిగజారుతున్నది.

బానిసత్వాన్ని రూపుమాపుతామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం బానిస లక్షణాలనే కొనసాగిస్తున్నది. గోవధ నిషేధం పేరుతో ఆహార విధానాలపై దాడులు, హత్యలు సాగిస్తున్నారు. తమ వ్యక్తిగత కమిట్‌మెంట్‌తో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించామని ప్రభుత్వం ఘనంగా చెప్పినప్పటికి...మసీదులు, చర్చిలు, మైనార్టీల ప్రార్థనా స్థలాలను కూల్చడానికి హిందూ మతం పేరుతో మూకదాడులు చేస్తున్నారు. చట్టాలలో మార్పులు తెస్తున్నారు. నాటి ఆంగ్లేయుల కాలం నాటి చట్టాలకు పేర్లు మార్చి శిక్షలను పెంచి పార్లమెంటులో చర్చించకుండానే ఆమోదిస్తున్నారు. 2047లో 100 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవాన్ని 'అమృతకాల్' పేరుతో ప్రచారం చేస్తూ ప్రస్తుతం ప్రజలు అనుభవిస్తున్న స్వాతంత్ర్యాన్ని హరించివేస్తున్నారు.

పట్టణాలకు వలసలు వెళ్ళిన 19 కోట్ల మంది ప్రజలు గత కరోనా కాలంలో ఉపాధి కోల్పోయి తిరిగి గ్రామాలకు వచ్చారు. వారికి ఎలాంటి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించలేదు. రెండు కోట్ల మందికి ఏటా ఉపాధి కల్పిస్తామన్న ప్రభుత్వం రైల్వే శాఖ, రవాణాశాఖ, రక్షణ శాఖలో ఉన్న కోట్ల ఖాళీలు భర్తీ చేయడంలేదు. గత 9 సంవత్సరాల 100 రోజుల పాలనలో దేశంలో నిరుద్యోగం 8 శాతం నుండి 22 శాతానికి పెరిగినట్లు ప్రపంచ బ్యాంక్ నివేదిక చెప్పింది. ప్రభుత్వ వ్యయంపై కాగ్ నివేదిక అనేక అభ్యంతరాలు చెప్పినప్పటికీ ఏ ఒక్కటీ పాటించలేదు. 2024 పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పంద్రాగస్టు జెండా ఆవిష్కరణ సందర్భంగా రానున్న 5 సంవత్సరాలలో 'విశ్వకర్మ పథకం' ద్వారా వృత్తిదారులకు రూ.13 వేల కోట్లు కేటాయించబోతున్నట్లు ప్రకటించారు. 169 పట్టణాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పథకం కింద 10,000 విద్యుత్ బస్సులను సరఫరా చేస్తామని, 9 రాష్ట్రాలలోని 35 జిల్లాల్లో రూ.32,500 కోట్లతో బహుళ రైల్వే ట్రాక్స్, మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, అమలుకాని పాత పథకాలతో పాటు కొత్త పథకాలను ప్రకటించారు. డిజిటల్ భారత్‌కు రూ.14,903 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్ తెస్తానని ప్రకటించారు. ఇన్ని ప్రకటనలు చేసిన కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరకుల ధరల పెరుగుదలను నిరోధించడంలో విఫలమైంది. పరోక్ష పన్నులు 32 శాతం నుండి 42.74 శాతానికి పెంచారు. కార్పొరేట్లకు ప్రత్యక్ష పన్నులు ఇతర దేశాలలో 35 శాతం ఉండగా, ఇక్కడ 25 శాతానికి తగ్గించారు. ప్రభుత్వం గత తొమ్మిదేళ్ల కాలంలో అంతకు ముందున్న రూ.55 లక్షల కోట్లకు తోడుగా పెరిగిన అప్పులు కలిపి రూ.155 లక్షల కోట్లు అయ్యాయి. వీటికి రూ.12 లక్షల కోట్లు వడ్డీలు చెల్లిస్తున్నాము. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకం, రైతులకు ఉపయోగపడే ఎరువుల సబ్సిడీలు పెద్ద ఎత్తున తగ్గించారు. దళిత, గిరిజన, మైనార్టీలే లక్ష్యంగా వారిపై ఆర్థిక, సాంఘిక దాడులు చేస్తున్న కేంద్రం ప్రకటించే పథకాలు ప్రజలకు భ్రమలు కల్పించడానికే తప్ప ఆచరణలో అమలు జరగడం లేదు. ప్రధాని మోడీ ప్రభుత్వ పథకాలు నీటిమూటలుగా మారాయి.

★

సమస్య

ధర్మో రక్షతి రక్షిత:. ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుంది. మరి ధర్మం అంటే ఏమిటి? ధర్మం కేవలం సూక్తి ముక్తావళి కాదు. ప్రవచన ప్రభోదాలు అంతకన్నా కాదు. ఆచరించేది, పాటించేది. మానవాళి ఏం ఆచరించాలి?

'అహింసా పరమో ధర్మహ:' అన్నాడు బుద్ధుడు. సమాజంలో హింస లేకుండా చేయాలి. నీవెలా సుఖశాంతులతో వర్ధిల్లుతున్నావో అలానే ఎదుటివారు కూడా ఉండాలని ఆలోచించడం, వ్యవహరించడం, ఆచరించడం, పాటించడం, ఏమైనా కావచ్చు. ఇతరులను ఇబ్బంది పెట్టకుండా, ఇతరులూ నీలాగే హాయిగా జీవించేలా నడుచుకోవడం, బాధితులకు సహకరించడం, ఆ సహకారంలో ఆనందం, తృప్తి పొందడం, ధర్మాచరణలో భాగమే అని చెప్పాడు. ఇతరుల హక్కులను ఉల్లంఘించేలా వ్యవహరించడం, బాధపెట్టేలా నడుచుకోవడం, హింసా రూపాల్లో భాగమే అని ఐక్యరాజ్యసమితి ఏనాడో పేర్కొన్నది. మానవ హక్కుల ఉల్లంఘన మానవ ధర్మ ఉల్లంఘనే అనే రీతిలో విశదీకరించింది. పూర్వం కాళిదాసుని కూడా భోజరాజు ఇలానే అడిగాడట. ధర్మం అంటే ఏమిటని? రెండే రెండు ముక్కల్లో సమాధానమిచ్చాడు కాళిదాసు. మహాకవి కదా. 'పరోపకారం పుణ్యం, పరపీడనం పాపం' అని తేల్చి చెప్పాడు.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు ఏలికలకు ఎంత బాధ్యత ఉన్నదో ఎరుగంది కాదు. అయినా వక్ర దృష్టితో, స్వార్థ దృష్టితో పాలన చేయడం వలన బాధితులకు ఉపశమనం లభించడం లేదు సరికదా వారి ఆక్రందనలు, ఆర్తనాదాలు అన్నీ అరణ్యరోదనగానే మిగులుతున్నాయి.

బాలికో రక్షతి రక్షిత:



ఆ తరువాత ఇటీవల కాలంలో 'వృక్షో రక్షతి రక్షిత:' అనే నినాదం పార్కులు, పర్యావరణ కార్యాలయాల గోడల మీద కనిపిస్తున్నది. నిజమే. వృక్షాలను మనం కాపాడితే వృక్షాలు మనల్ని కాపాడుతాయి. వృక్షాలకు స్థూల రూపం అరణ్యం. అంటే అరణ్యాలను పరిరక్షిస్తేనే మనకు సరైన పర్యావరణం, వర్షాలు, నీరు, ప్రాణవాయువు, ఫలసంపద, జీవన సమతుల్యత అన్నీ సక్రమంగా, సహజంగా సమృద్ధిగా లభిస్తాయని వేరుగా చెప్పక్కర్లేదు. అందుకే అటవీ సంపదను యథేచ్ఛగా నిర్మూలించకుండా, గనులు, ఖనిజాలు వంటి సహజ వనరుల కోసం ధ్వంసం చేయకుండా బాధ్యతగా పెంపొందించుకోవాలి, విస్తరించుకోవాలి. వన సంరక్షణ, సామాజిక అటవీ పెంపుదల పథకం మొదలైనవి అన్నీ కార్యాలయాల కాగితాలకు, పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా అందరికీ ముఖ్యంగా అటవేతర ప్రజలు తమ దైనందిన జీవితంలో ఆచరించేలా పెద్ద ఎత్తున మార్పు తీసుకురావాలి. లేకుంటే తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే అన్న చందంగా పరిస్థితి విషమించుతుంది. ఇప్పుడు దాదాపు అలానే ఉన్నది మరి. మణిపూర్‌లో మానవ వనరులకన్నా సహజ వనరులకు ప్రాధాన్యత నివ్వడం చూస్తున్నాముగా.

ఇక ఇప్పుడు మూడవ నినాదం బాలికో రక్షతి రక్షిత:' బాలికలను మనం కాపాడుకుంటే బాలిక మనల్ని కాపాడుతుంది. బాలిక స్వేచ్ఛగా (భయం లేకుండా) ఆరోగ్యంగా, హాయిగా ఎదగాలి. అలా ఆరోగ్యంగా ఎదిగిన బాలికే తర్వాత యువతిగా, తల్లిగా మారి ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తుంది. మన దేశంలో అందరికన్నా ఎక్కువగా ఉల్లంఘనకు గురవుతున్నది బాలికా హక్కులే. జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, గుర్తింపు, గౌరవం పొందే హక్కు ప్రతి బాలికకూ ఉన్నదే. బాలల హక్కులన్నీ బాలికల హక్కులే. మరి ప్రతి బాలిక వీటిని అనుభవించగలుగుతున్నదా...అంటే తొంభై శాతం లేదనే సమాధానం వస్తుంది. ఎంతెంత అణచివేత, ఎంతెంత వివక్ష, ఎన్నెన్ని వేధింపులు, చిత్రహింసలు, అత్యాచారాలు, అపహరణలు, హత్యలు కళ్ళ ముందు తారట్లాడుతున్నాయి. వర్ణించనలవి కాకున్నవి. క్షణక్షణానికి పర్వతంలా పెరిగిపోతున్న ఈ ఘోర అధర్మాన్ని మనం నివారించలేమా? బాలికను వేరేలా చూసే పాప పంకిలాన్ని అరికట్టలేమా? నిత్యం కీర్తించే మన భరతమాత పసి హృదయం పట్ల మనకు ఎందుకు అంత కండకావరం? పసి భారతమాతను పరిరక్షించుకోలేని మన చదువుల అభివృద్ధి చట్టుబండలు కావా? మన పాలన ప్రజాస్వామ్యం అనిపించుకుంటుందా? మరి ప్రపంచంలోనే ప్రజాస్వామ్యానికి మన భారతమాత తల్లి వంటిదని చెప్పుకుంటున్నామే? ఇందులో ఏమాత్రమైనా సత్యం ధర్మం ఉన్నదా? కావాలంటే ఈ లెక్కలు చూడండి.

2019-21 మధ్య అంటే ఈ రెండేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు పదమూడు లక్షల మంది బాలికలు, స్త్రీలు అదృశ్యమైనట్టు ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించింది. ఈ సంఖ్య ఇప్పటికి ఇంకా పెరిగే ఉంటుంది. ఈ పాపం ఎవరిది? మానవ అక్రమ రవాణాకు అంతే లేకుండా పోతున్నది. సంతలో పశువులను అమ్మినట్టు బాలికలను, స్త్రీలను ఈ విధంగా నోరూ వాయీ కట్టేసి అమానుషంగా క్రయ విక్రయాలు చీకటి బజారుల్లో జరపడం ఎంత ఘోరం? ఎంత వికృతం? మనం ఆధునిక సమాజంలో జీవిస్తున్నామా? మధ్యయుగాల్లో జీవిస్తున్నామా? అనే ప్రశ్న ఉత్పన్నం కాకమానదు. ఇలాంటి మానవ (బానిస) వ్యాపారానికి తావేలేదని మన భారత రాజ్యాంగం 23వ అధికరణం నిర్దేశిస్తున్నది కూడా. అయినా బాలికలతో, స్త్రీలతో వెట్టిచాకిరీ, వ్యభిచారం, భిక్షాటన, అవయవ చౌర్యం.. బూతు చిత్రాలు ఒకటేమిటి...ఈ ఘోర కలి నానాటికి ఇలా విస్ఫోటనం అవుతున్నది. ఈ సంఖ్య రెండుకోట్లకు పైగా ఉంటుందని అంచనా. నోబుల్ పురస్కార గ్రహీత కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ భాగస్వామ్యంతో జరిగిన సర్వేలో వెల్లడైన ఈ విషయాలతో సభ్యసమాజం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మానవ క్రౌర్యం, దాష్టికం బాలికల పట్ల ఇంత పాషాణంగా ఎందుకు మారుతున్నది? నివారించే మార్గమే లేదా? అనే ఆవేదన సర్వత్రా వెల్లడవుతున్నది. ఉన్మాదులు మాత్రం ఇది మామూలే అన్నంతగా జడత్వానికి లోనవుతున్నారు. దుర్మార్గానికి వంత పాడటమే ఈ ప్రాప్తకాలజ్ఞత.


కొండా కోనల్లో, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు సైతం, వారి పేదరికాన్ని, క్షుద్బాధను అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని భౌతికంగానో, అంతర్జాలంగానో వల విసరడం, ఆకర్షణీయమైన ఉపాధులను వారికీ, వారి తల్లిదండ్రులకు ఎరగా చూపడం, తర్వాత వారిని మాఫియా మూకలకు అప్పజెప్పడం, మత్తు పదార్థాలకు అలవాటు చేయడం, హార్మోన్ల ఇంజక్షన్లతో లేత వయసులోనే వ్యభిచార కూపాల్లోకి నెట్టడం, చిత్రహింసలు పెట్టడం సాధారణ కృత్యమైపోయింది. మాదక ద్రవ్యాల మాదిరి బాలిక కూడా అక్రమ రవాణా సరుకుగా మారడం విషాదాల్లో కెల్లా విషాదం. దీనికి విరుగుడు ఈ దుర్మార్గాన్ని కూకటివేళ్ళతో సహా పెకిలించాలన్న చిత్తశుద్ధి, రాజకీయ సంకల్పం, పాలకులకు ప్రథమంగా ఉండాలి. రెండవది పాఠశాలల్లో, బయటా లైంగిక వేధింపులు, చిత్రహింసలు, వివక్ష, అక్రమ రవాణా పట్ల అప్రమత్తత కలిగే విధంగా పాఠ్యాంశాలు, ప్రచారం ముమ్మరంగా సాగాలి. లేకుంటే బాలికో రక్షతి రక్షిత: కూడా మిగిలిన వాటి మాదిరి నినాద ప్రవచనంగానే మిగిలిపోతుంది. అశ్రు నయనాల బాలికా భారతి అను నిత్యం మనల్ని వెన్నాడుతూనే ఉంటుంది. మన భారతమాతకు విముక్తి లేదన్న సత్యం ప్రపంచానికి వెల్లడవుతూనే ఉంటుంది.

- కె. శాంతారావు, సెల్ : 9959745723



చంద్రయాన్ సక్సెస్

- చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగిడిన విక్రమ్ ల్యాండర్
- ఈ ఘనత సాధించిన తొలి దేశంగా రికార్డు
- ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల వర్షం
- సెప్టెంబరులో సోలార్ మిషన్ ?



బెంగళూరు : రోదసీ రంగంలో భారత్ కొత్త చరిత్ర సృష్టించింది. ఎట్టకేలకు కోట్లాదిమంది భారతీయుల ఆశలు ఫలించాయి. గత కొద్ది రోజులుగా నెలకొన్న ఉత్కంఠతకు తెరదించుతూ విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై నిర్దిష్ట ప్రదేశంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తల ఆనందానికి అవధుల్లేవు. చంద్రయాన్-2 వైఫల్యం నుంచి గుణపాఠం తీసుకుని చంద్రయాన్-3ని విజయవంతం చేసిన శాస్త్రవేతలపై ప్రశంసల వర్షం కురిసింది. ఇదొక చారిత్రాత్మక రోజు అని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు దక్షిణాఫ్రికా వెళ్లిన ప్రధాని మోడీ అక్కడి నుంచి చంద్రయాన్-3 చివరి ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఇప్పటివరకు ఎవరు అంతరిక్ష నౌకలను పంపినా భూమికి కనిపించే చంద్రుని ఉపరితలం భాగంపైనే దిగాయి, కానీ ఇస్రో ఎవరూ చూడని జాబిల్లి ఆవల వైపునకు విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితంగా దించి రష్యా, అమెరికా, చైనాల సరసన చేరింది.

వెల్లువెత్తుతున్న అభినందనలు

ఇస్రో కృషిని అభినందిస్తూ దేశ విదేశాల నుండి ప్రశంసలు వెల్లువెత్తాయి. నూతన సాంకేతికతలను భారత్ ప్రదర్శించిన తీరు ఆమోఘమని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ వ్యాఖ్యానించారు. నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ కూడా ఇస్రోను అభినందించారు. మూన్ మిషన్‌కు అవసరమైన పరికరాలను, వస్తువులను సరఫరా చేసిన లార్సెన్ అండ్ టుబ్రో, గాద్రెజ్ అండ్ బాయిస్ కంపెనీలు కూడా అభినందనలు అందచేశాయి. పలు రాజకీయ పార్టీల నేతలు, మంత్రులు, అధికారులు, ప్రముఖులు, చలనచిత్ర పరిశ్రమ ఇస్రో దేశానికే గర్వకారణమని వ్యాఖ్యానించాయి.

అద్భుత ప్రయాణం : సీతారాం ఏచూరి

చరిత్ర సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలకు సిపిఎం నేత సీతారాం ఏచూరి అభినందనలు తెలియచేశారు. దశాబ్దాల తరబడి శాస్త్రవేత్తలు చేసిన కృషికి ఈ విజయం నిదర్శనం. భారత్‌కు ఇది మహత్తరమైన రోజు, శాస్త్రీయ దృక్పథానికి, హేతుబద్ధతకు లభించిన విజయమిది అని కొనియాడారు. ఆరు దశాబ్దాలుగా నిబద్ధత, కఠోర శ్రమ, అంకిత భావంతో చేసిన కృషి, దార్శనికత ఫలించాయని అన్నారు. ఈ ప్రయాణం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

ఇక సూర్యుడే లక్ష్యం

జాబిల్లిపై పెట్టుకున్న లక్ష్యాన్ని విజయవంతంగా సాధించిన ఇస్రో ఇక తన తర్వాతి ప్రాజెక్టులపై దృష్టి పెట్టనుంది. త్వరలోనే ఆదిత్య ఎల్1 పేరుతో ఇస్రో సోలార్ మిషన్‌ను ప్రారంభిస్తుందని ప్రధాని మోడీ ప్రకటించారు. సెప్టెంబరు మొదటి వారంలో బహుశా దీనిపై వివరాలు వెల్లడయ్యే అవకాశం వుంది. వాతావరణ పరిశీలనకు ఉపగ్రహాన్ని పంపించాలని కూడా ఇస్రో భావిస్తోంది. గగన్‌యాన్ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ ప్రోగ్రామ్‌లో భాగంగా టెస్ట్ వెహికల్‌ను పంపాలని చూస్తోంది. శుక్ర గ్రహంపైకి కూడా మిషన్ చేపట్టాలని ఇస్రో భావిస్తోంది.

అనుకున్న సమయానికి అనుకున్నట్లుగా అన్నీ...

ల్యాండింగ్ ప్రక్రియకు రెండు గంటలు ముందుగా 3.45 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌ను, ల్యాండింగ్ పరిస్థితులను ఇస్రో నిశితంగా పరిశీలించింది. ఒకవేళ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే 27న ఈ ల్యాండింగ్ ప్రక్రియను ప్రారంభించాలని కూడా నిర్ణయించింది. అయితే, సరిగ్గా నిర్దేశిత సమయం 5.44 గంటలకు ల్యాండింగ్ ప్రక్రియ మొదలైంది. తర్వాత వరుసగా నాలుగు దశలను విజయవంతంగా అధిగమిస్తూ లక్ష్యాన్ని చేరుకుంది. 10నిముషాలకు పైగా గల రఫ్ బ్రేకింగ్ దశలో ల్యాండర్ సమతల వేగం గంటకు 6వేల కిలోమీటర్ల నుండి గంటకు 500కిలోమీటర్ల వరకు తగ్గింది. ఆ తర్వాత అల్టిట్యూడ్ హోల్డింగ్ దశలో చంద్రుని ఉపరితలంపైన దాదాపు 7.43 కిలోమీటర్ల ఎత్తున వున్న ల్యాండర్ దాదాపు 3.48కిలోమీటర్లు దూరం కిందకు దిగి సమతులంగా చేస్తున్న ప్రయాణాన్ని నిట్టనిలువుకు పొజిషన్‌కు మార్చుకుంది. ఫైర్ బ్రేకింగ్ దశ 175 సెకన్లు వుంది. ఈ సమయంలో ఎత్తును ఒక కిలోమీటరు తగ్గించుకుంటూనే దిగాల్సిన ప్రదేశానికి 28.52 కిలోమీటర్లు సమతులంగా ప్రయాణించింది. ఇక చివరి దశలో నిట్టనిలువుగా వున్న ల్యాండర్ చంద్రుని ఉపరితలంపై ముందుగా నిర్దేశించిన ప్రదేశంలో సురక్షితంగా దిగింది.

కొద్ది సేపటికే బయటకు వచ్చిన ప్రజ్ఞాన్ రోవర్

ల్యాండర్ మిషన్‌లోని అన్ని వ్యవస్థల పని తీరును ఇస్రో పర్యవేక్షిస్తోంది. ల్యాండింగ్ అయిన కొద్ది సేపటికే విక్రమ్ ల్యాండర్ నుండి ప్రజ్ఞాన్ రోవర్ బయటకు వచ్చి చంద్రునిపై అన్వేషణ ప్రారంభించింది. ఊహించిన దానికన్నా ల్యాండర్ దిగిన వేగం చాలా తక్కువగా వుందని అన్నారు. సెకనుకు 2 మీటర్లు లక్ష్యంగా పెట్టుకోగా అంతకన్నా తక్కువగానే వుందని, దీంతో భవిష్యత్ మిషన్‌లపై మరింతగా ఆశలు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. రాబోయే 14 రోజుల్లో ల్యాండర్, రోవర్లలోని పరికరాలు చేసే ప్రయోగాలు ఉద్వేగభరితంగా వుంటాయని అన్నారు. విజయ సాధనలో భాగస్వాములైన శాస్త్రవేత్తల బృందానికి సోమనాథ్ కృతజ్ఞతలు తెలియచేశారు.

వైఫల్యాల నుండి గుణపాఠాలు

చంద్రయాన్ 2 విఫలమైన నేపథ్యంలో కసిగా మరింత కఠినమైన కసరత్తు చేసి, వైఫల్యాల నుండే గుణపాఠాలు నేర్చుకుని మరింత పకడ్బందీగా చంద్రయాన్-3కి ఇస్రో సిద్ధమైంది.

చంద్రయాన్-2లో లేని కొన్ని అంశాలను ఈసారి అదనంగా జోడించింది.

గంటకు 10.8కిలోమీటర్ల వేగం వరకు సురక్షితంగా దిగగలిగేలా కొత్త విక్రమ్ ల్యాండర్ కాళ్ళను పటిష్టపరిచింది.

- అలాగే పెద్ద ఇంధన ట్యాంక్‌ను అమర్చారు. చివరి నిముషంలో మార్పులు జరిగి అవసరమైతే అనుకూల ప్రదేశం కోసం అన్వేషణ సాగించేవరకు ఇంధనం వుండేలా చంద్రయాన్-3లో మరింత పెద్ద ట్యాంక్‌ను అమర్చారు.
- చంద్రయాన్-2లో కేవలం రెండువైపుల సౌర ఫలకాలు పెట్టగా, ఈసారి ల్యాండర్‌కు నాలుగు వైపులా సోలార్ ప్యానెళ్ళు అమర్చారు.
- సాఫ్ట్ ల్యాండింగ్‌కు వెసులుబాటు కల్పించేలా మరింత మెరుగైన సాఫ్ట్‌వేర్‌ను, అదనపు పరికరాలను ల్యాండర్‌లో అమర్చారు.

చంద్రయాన్ 1 నుంచి నేటి దాకా....

చంద్రుడుపైకి భారత్ పంపిన తొలి మిషన్ చంద్రయాన్ వన్ 2008లో పూర్తయింది. ఖర్చు రూ.386 కోట్లు. చంద్రయాన్-2 ప్రయోగం కోసం రూ.978 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు చంద్రయాన్-3కి రూ.615 కోట్లు ఖర్చు అయింది,. జులై 6: చంద్రయాన్-3ని జులై 14న శ్రీహరికోటలో లాంచ్ ప్యాడ్-2 నుంచి ప్రయోగించబోతున్నట్లు ఇస్రో ప్రకటించింది.

ఎన్నిసార్లు కక్ష్యను పెంచారు?

భూమి చుట్టూ తిరిగేటప్పుడు ఐదుసార్లు చంద్రయాన్-3 వ్యోమనౌక కక్ష్యను శాస్త్రవేత్తలు పెంచారు.
జులై 15: తొలిసారి కక్ష్యను పెంచారు.
జులై 17: రెండోసారి చంద్రయాన్-3 ఎత్తును పెంచుతూ కక్ష్యను మార్చారు.
జులై 18: మూడోసారి ఎత్తును పెంచుతూ కక్ష్యను మార్చారు.
జులై 20: నాలుగోసారి చంద్రయాన్-3 కక్ష్యను మార్చారు.
జులై 25: చివరిసారిగా ఐదోసారి కక్ష్యను పెంచారు.

చంద్రుడి వైపు పయనం ఎప్పుడు మొదలైంది?

ఆగస్టు 1: భూమి చుట్టు తిరిగే చంద్రయాన్-3 రాత్రి 1 గంట సమయంలో చంద్రుడి వైపుగా పయనం మొదలుపెట్టింది.
ఆగస్టు 5: విజయవంతంగా దీన్ని చంద్రుడి కక్ష్యలోకి పంపించారు. 164 కి.మీ. %ఇ% 18074 కి.మీ. దగ్గర దీన్ని చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.
ఆగస్టు 6: చంద్రుడికి దగ్గరగా వెళ్లేందుకు మరోసారి కక్ష్యను తగ్గించారు. దీర్ఘవత్తాకార కక్ష్యలో 170 కి.మీ %ఇ% 4313 కి.మీ. దగ్గర ప్రవేశపెట్టారు.
ఆగస్టు 9: చంద్రయాన్-3ను 174 కి.మీ - 1437 కి.మీ. దగ్గర కక్ష్య మార్చారు.
ఆగస్టు 14: చంద్రయాన్-3ను 151 కి.మీ.- 179 కి.మీ. దగ్గర కక్ష్య మార్చారు.
ఆగస్టు 16: చంద్రయాన్-3ను 153 కి.మీ. - 163 కి.మీ. దగ్గర కక్ష్య మార్చారు.

ల్యాండర్ వేరుపడిందిలా

ఆగస్టు 17: చంద్రయాన్-3 బూస్టర్ నుంచి విక్రమ్ ల్యాండర్ విజవంతంగా వేరుపడింది.
ఆగస్టు 19: విక్రమ ల్యాండర్ దీర్ఘవత్తాకార కక్ష్యలో చంద్రుడి చుట్టూ తిరగడం మొదలుపెట్టింది.
ఆగస్టు 20: విక్రమ్ ల్యాండర్ కక్ష్యను తగ్గించి 25 కి.మీ. - 134 కి.మీ. వద్ద కక్ష్య మార్చారు.
ఆగస్టు 23: చంద్రుడి ఉపరితలంపై విక్రమ్ సాఫ్ట్ ల్యాండ్ అయింది.

చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ ఏం చేస్తుంది?

చంద్రుడి దక్షిణ ధ్రువం దగ్గర 70 డిగ్రీల అక్షాంశం వద్ద విక్రమ్ ల్యాండ్ అయ్యింది. అక్కడ కొన్ని పరిశోధనలను విక్రమ్ చేపడుతుంది.

చంద్రుడి ఉపరితలంపై ఎలాంటి మార్పులు చేసుకుంటున్నాయి? ఇక్కడ ఎలాంటి ఖనిజాలు లభ్యమవుతాయి లాంటి వివరాలను విక్రమ్ సేకరిస్తుంది.

భూమి తరహాలో చంద్రుడిపైనా ప్రకంపనలు వస్తున్నాయో లేదో కూడా డేటా సేకరిస్తుంది.

విక్రమ్ ల్యాండర్ కిందకు దిగిన తర్వాత దాని నుంచి రోవర్ బయటకు వస్తుంది. ఇది చంద్రుడిపై మట్టి నమూనాలను పరీక్షిస్తుంది. సంబంధిత వివరాలను శాస్త్రవేత్తలకు పంపిస్తుంది.

విస్తరణ, మరింత సహకారంపై బ్రిక్స్ నేతల దృష్టి



జోహన్నస్‌బర్గ్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగింట ఒక వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిక్స్ దేశాధినేతలు బుధవారం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో సమావేశమై విస్తరణ, సహకారాన్ని మరింతగా పెంచుకోవడంపై దృష్టి సారించారు. అంతర్జాతీయ రంగంలో వర్ధమాన దేశాలు మరింత సందర్భోచితంగా మారుతున్నాయని, కొత్త ప్రపంచ ఆర్థిక, రాజకీయ క్రమాన్ని రూపొందించేందుకు ఈ శిఖరాగ్ర సమావేశం ఎంతగానో దోహదపడుతుందని చైనా అధ్యక్షులు జీ జిన్‌పింగ్ అన్నారు.

15వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో బుధవారం జిన్‌పింగ్ మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది కొన్ని దేశాల ప్రత్యేక హక్కు కాదని, అన్ని దేశాలకు విడదీయరాని హక్కు అని అన్నారు. 'బ్రిక్స్ దేశాలు అభివృద్ధి, పునరుజ్జీవన మార్గంలో సహచరులుగా ఉండాలి, పారిశ్రామిక- సరఫరా గొలుసులను విచ్ఛిన్నం చేసే చర్యలను వ్యతిరేకించాలి, అలాగే ఆర్థిక బలవంతం చేయాలి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, హరిత అభివృద్ధి, సరఫరా గొలుసు వంటి రంగాలలో ఆచరణాత్మక సహకారంపై దృష్టి పెట్టాలి' అని చెప్పారు. అలాగే

బ్రిక్స్ సత్వర విస్తరణతో పాటు మరింత న్యాయమైన- సహేతుకమైన ప్రపంచ పాలనను ప్రోత్సహించేందుకు కృ చేయాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.

'ఒకరి స్వంత నియమాలు- నిబంధనలను అంతర్జాతీయ ప్రమాణంగా ప్యాకేజ్ చేయడం ఆమోదయోగ్యం కాదు" అని చెప్పారు. బ్రెజిల్ అధ్యక్షులు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా, భారత ప్రధాని నరేంద్ర మోడీ, దక్షిణాఫ్రికా అధ్యక్షులు సిరిల్ రమఫోసా కూడా ప్రసంగించారు. రష్యా నుంచి ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ వ్యక్తిగతంగా రష్యాకు ప్రాతినిధ్యం వహించగా, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ వర్చువల్ విధానంలో ప్రసంగించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేయాల్సిన అవశ్యకతను వివరించారు.

40కి పైగా దేశాలు బ్రిక్స్‌లో చేరేందుకు ఆసక్తిని వ్యక్తం చేయడంతో కొత్త సభ్యులను చేర్చుకునే నిబంధనలను నాయకులు పరిశీలించారు.

బ్రిక్స్ విస్తరణకు భారత్ పూర్తి మద్దతు: మోడీ

ఏకాభిప్రాయం ఆధారంగా బ్రిక్స్ కూటమిని మరింత విస్తరించేందుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. భాగస్వామ్య దేశాల పరస్పర సహకారంతో ముందుకు వెళ్లడాన్ని తాము స్వాగతిస్తామన్నారు. దక్షిణాఫ్రికాలో జరిగిన 15వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రసంగించిన మోడీ ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వాన్ని తాము ప్రతిపాదిస్తున్నామన్నారు. బ్రిక్స్ భాగస్వామ్య పక్షాలు కూడా ఇందుకు మద్దతు పలుకుతాయని ఆశిస్తున్నామని అన్నారు.

భవిష్యత్తుకు బ్రిక్స్ సంసిద్ధంగా ఉండాలంటే మనం మన సమాజాలను భవిష్యత్తుకు సిద్ధంగా ఉంచుకోవాలని మోడీ పిలుపునిచ్చారు. భారత్ అధ్యక్షతన జరుగుతోన్న జీ20 సదస్సులో గ్లోబల్ సౌత్ దేశాలకు తమ దేశం అత్యంత ప్రాధాన్యం కల్పిస్తోందని చెప్పిన మోడీ, బ్రిక్స్‌లోనూ అటువంటి ప్రాముఖ్యతను కల్పించడాన్ని స్వాగతించారు. గ్లోబల్ సౌత్ అభివృద్ధిలో బ్రిక్స్‌కు చెందిన న్యూ డెవెలప్‌మెంట్ బ్యాంక్ కీలక పాత్ర పోషిస్తోందన్న ఆయన.. గడిచిన రెండు దశాబ్దాలుగా ఈ కూటమి ప్రయాణం ఎంతో అద్భుతంగా సాగుతోందన్నారు. రైల్వే రీసెర్చ్ నెట్‌వర్క్, ఎంఎస్‌ఎంఈల మధ్య సహకారం, స్టార్టప్ రంగాల్లో తీసుకోవాల్సి చర్యలపై భారత్ చేసిన సూచనలతో ఎంతో పురోగతి కనిపిస్తోందని ప్రధాని మోడీ చెప్పారు.

భారత్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక పురోగతి గురించి వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో త్వరలోనే భారత్ కీలక భూమిక పోషించనుందన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చటం తమ సంకల్పమన్నారు.

బోర్డు పరీక్షలు ఏడాదికి రెండు సార్లు

(మొదటి పేజీ తరువాయి)

బోర్డులకు సిఫార్సుగా ఉంటాయి. ఎన్‌సిఎఫ్ చివరిగా 2005లో సవరించారు.

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఈఆర్‌టి) ప్రజా సంప్రదింపుల కోసం ఏప్రిల్‌లో ఎన్‌సిఎఫ్ ముందస్తు ముసాయిదాను విడుదల చేసింది. చివరి ఎన్‌సిఎఫ్ డ్రాఫ్ట్‌లో చేర్చబడిన చాలా సిఫార్సులు ఉన్నాయి. కొన్ని మార్పులు కూడా ఉన్నాయి. 11, 12 తరగతుల విద్యార్థులకు కనీసం రెండు భాషలను అందించాలన్న ఎన్‌సిఎఫ్ సూచన, వాటిలో ఒకటి భారతీయ భాష తప్పని సరి అని పేర్కొంది.

భాషల ఎంపికలలో సాంప్రదాయ తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, ఒరియా, పాలీ, పర్షియన్, ప్రాకృతంతో సహ సంస్కృతం, ఇతర ఆధునిక, క్లాసికల్ భాషలు, భారతదేశ సాహిత్యం ఉంటాయి. వీటితోపాటు ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, కొరియన్ వంటి విదేశీ భాషలు కూడా అందించబడతాయి.

ప్రస్తుతం సిబిఎస్‌ఈ పాఠశాలల్లో 11, 12 తరగతుల విద్యార్థులకు ఒకే భాష బోధిస్తున్నారు. ఈ తరగతుల్లో ఒక భాష అదనంగా మరో సబ్జెక్ట్ పెరుగుతుంది. "ఈ భాషలు, సాహిత్యాలు సజీవంగా, చైతన్యవంతంగా ఉండేలా చూడటం కోసం, ప్రత్యేకించి ఉత్తమంగా బోధన, పెంపొందిస్తుంది" అని ఫ్రేమ్‌వర్క్ పేర్కొంది.

"12వ తరగతి వరకు ఉన్న విద్యార్థులందరికీ బోధనా మాధ్యమం కోసం దేశానికి చెందిన కనీసం ఒక భాష ఎంపిక చేయబడుతుంది" అని కూడా ఫ్రేమ్‌వర్క్ నొక్కి చెప్పింది. ఇటీవల, సిబిఎస్‌ఈ పాఠశాలలను భారతీయ భాషలను బోధనా మాధ్యమంగా అందించాలని కోరింది. విద్యార్థులు మంచి పనితీరు కనబరిచేందుకు తగిన సమయం, అవకాశం ఉండేలా ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలను నిర్వహించాలని ముసాయిదాలో ప్రతిపాదించిన సిఫార్సును కూడా ఫ్రేమ్‌వర్క్ నిర్ధారిస్తుంది. ఇది 11, 12 తరగతులకు సెమిస్టర్ విధానాన్ని సిఫార్సు చేసింది. "కళలు, మానవీయ శాస్త్రాలు, శాస్త్రాల మధ్య ఎటువంటి విభజన లేదు" అని పేర్కొంది. "దీర్ఘకాలంలో, అన్ని (విద్య) బోర్డులు సెమిస్టర్ లేదా టర్మ్-ఆధారిత వ్యవస్థలకు మారాలి. విద్యార్థులు ఒక సబ్జెక్ట్‌ను పూర్తి చేసిన వెంటనే మరొక సబ్జెక్ట్‌లో పరీక్షించవచ్చు. ఇది ఏదైనా ఒక పరీక్షలో పరీక్షించబడే కంటెంట్ లోడ్‌ను మరింత తగ్గిస్తుంది" అని ఫ్రేమ్‌వర్క్ తెలిపింది.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

- గవర్నరు, సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఈ ప్రక్రియలో పాల్గొన్న సభ్యులందరికీ గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఇది మనదేశ ప్రజలందరూ గర్వించదగ్గ చారిత్రక విజయమని బుధవారం ఒక ప్రకటనలో గవర్నరు పేర్కొన్నారు. ఇది భారత్‌కు అపురూపమైన విజయమని సిఎం ట్వీట్ చేశారు.

సరికొత్త చరిత్ర : చంద్రబాబు

చంద్రయాన్-3 విజయంతో ఇస్రో సరికొత్త చరిత్ర సృష్టించిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్‌ను విజయవంతంగా నిలిపినందుకు ఇస్రోకు శుభాకాంక్షలు తెలిపారు. వారి సంకల్ప బలానికి, స్ఫూర్తికి తన సెల్యూట్ అని పేర్కొన్నారు.

యుటిఎఫ్ హర్షం

చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంగా ముగించి చంద్రునిపై కృత్రిమ ఉపగ్రహాలు పంపిన రష్యా, అమెరికా, చైనా సరసన భారతదేశాన్ని నిలపడంలో భారత శాస్త్రజ్ఞులు చేసిన కృషి అభినందనీయమని యుటిఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. చంద్రుని దక్షిణ ధ్రువంపై రష్యా ప్రయోగించిన లూనార్-25 విఫలమైన సందర్భంలో దేశం ప్రయోగించిన విక్రమ్‌ను విజయవంతంగా ల్యాండ్ చేయడంలో ఇస్రో శాస్త్రవేత్తలు జయప్రదం అయ్యారని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై ఉన్న నీటి నిల్వలు, ఖనిజ సంపద, భౌగోళిక పరిస్థితులు అంచనా వేసేందుకు ఈ ప్రయోగం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం శాస్త్రీయ అంశాల పట్ల విద్యార్థుల ఆసక్తిని పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపారు. మూఢనమ్మకాలకు తావివ్వకుండా, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాలకు బడ్జెట్‌లో మరిన్ని కేటాయింపులు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

సువర్ణ అధ్యాయం : పవన్‌కల్యాణ్

భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. భారతీయుల ఆశలను సజీవంగా మోస్తూ చంద్రయాన్-3లో భాగమైన విక్రమ్ ల్యాండర్ చందమామపై అడుగుపెట్టడం అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న విజయపథంలో ముఖ్య ఘట్టమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

చందమామ రావే!



చందమామ రావే
జాబిల్లి రావే
రాకెట్టెక్కి రావే
రహస్యాలు చెప్పవే ...

దుమ్ము ధూళి గున్నవా
ఎగుడు దిగుడుగున్నవా
నీ వింతవింతలన్ని
విక్రంతోని చెప్పవే

నీటి జాడ ఉన్నదా
వాతావరణమున్నదా
కొత్త కొత్త విశేషాలు
మట్టి పంపి చెప్పవే


ఆ వెండి కొండల్లో
ఏ ఖనిజముంది
నీ గర్భమందున
ఏముంది చెప్పవే

వెండి వెన్నెలెందుకు
అమాస పున్నమెందుకు
భూమి ప్రదక్షిణెందుకు
చందమామ చెప్పవే

మేమక్కడొచ్చి
నివసించవచ్చా
వెన్నెల మామతో
ఆటలాడవచ్చా

చెప్పవే చెప్పవే
జాబిల్లి చెప్పవే
రాకెట్ పైన వచ్చి
వివరంగ చెప్పవే

- ఆవుల చక్రపాణి యాదవ్



లెక్క చేద్దాం

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన ఆధారాలను బట్టి చివరి సమాధానం మీరు రాబట్టండి.

జవాబు : 21

నేను గీసిన బొమ్మ



ఎస్.ప్రకృతి కృష్ణ, 2వ తరగతి, పర్పుల్ వాలీ స్కూలు, నెల్లూరు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అశోకా యూనివర్సిటీలో ఐబి

- విద్యావేత్తలు, ఎంపిలు దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ : హర్యానాలోని అశోకా యూనివర్సిటీని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) అధికారులు సందర్శించటం చర్చనీయాంశంగా మారింది. ఈ వారం ఐబి బృందం సందర్శించిందని వచ్చిన వార్తలపై విద్యావేత్తలు, ప్రతిపక్ష ఎంపీలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ప్రస్తుతం పూణేలో ఉన్న పేపర్ రచయిత సబ్యసాచి దాస్‌ను కలవాలని కోరుతూ వార్తాపత్రిక కటింగ్‌లతో ఐబీ అధికారులు సోమవారం ప్రయివేటు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. మంగళవారం మళ్లీ క్యాంపస్‌కి వస్తామని చెప్పి వెళ్లిపోయారు. యాధృచ్ఛికంగా, అశోక విశ్వవిద్యాలయం యొక్క విదేశీ కాంట్రిబ్యూషన్ (నియంత్రణ) చట్టం లైసెన్స్ సెప్టెంబర్ 2023లో పునరుద్ధరణకు వస్తున్నది" అని తెలిపారు. ఇండో-ఆసియన్ న్యూస్ సర్వీస్ (ఐఎఎన్ఎస్) నివేదిక సమాచారం ప్రకారం.. "ఐబీ నుంచి ఒక బృందం సోమ, మంగళవారాల్లో అశోక విశ్వవిద్యాలయం తలుపులు తట్టింది. బృందం సందర్శించినట్టు క్యాంపస్‌లోని వర్గాలు ఐఎఎన్ఎస్‌కు ధృవీకరించాయి" అని వెల్లడించింది. "అయితే, దాస్ సెలవులో ఉన్నారని వర్సిటీ అధికారులు సమాచారం ఇచ్చారు. ఐబీ అధికారులు ఆర్థిక శాస్త్ర విభాగంలోని ఇతర ఫ్యాకల్టీ సభ్యులను కలవాలని అభ్యర్థించారు" అని వివరించింది. అయితే, భద్రతా సంస్థలు మాత్రం ఈ వార్తలను ధృవీకరించలేదు. తిరస్కరించలేదు. అశోక వైస్-ఛాన్సలర్ సోమక్ రాయ్‌చౌదరి, ఆర్థిక శాస్త్ర విభాగం అధిపతి అశ్విని దేశ్‌పాండేలు కూడా ఈ విషయంలో స్పందించకపోవటం గమనార్హం.

సెప్టెంబరులో భారత్‌కు బైడెన్ రాక

వాషింగ్టన్ : సెప్టెంబరు 7 నుండి 10 వరకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత్‌లో పర్యటించనున్నారని వైట్‌హౌస్ ప్రకటించింది. 9, 10 తేదీల్లో భారత్‌లో జరిగే జి-20 దేశాల నేతల సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఉక్రెయిన్ యుద్ధంతో పాటూ పలు అంతర్జాతీయ అంశాలపైన నేతలు చర్చించనున్నారు. గతేడాది డిసెంబరు 1న జి-20 అధ్యక్ష బాధ్యతలను ఇండోనేషియా నుండి భారత్ చేపట్టింది. వచ్చే నెల జరగబోయే సదస్సులో పెద్ద సంఖ్యలో ప్రపంచ నేతలు పాల్గొంటారని భావిస్తున్నారు. పరిశుద్ధ ఇంధన వినియోగానికి మారడం, వాతావరణ మార్పులను ఎదుర్కొనడం వంటి కీలకాంశాలతో సహా పలు అంశాలపై చర్చలు జరగనున్నాయి. అలాగే ఉక్రెయిన్‌లో రష్యా జరుపుతున్న యుద్ధంతో తలెత్తిన ఆర్థిక, సామాజిక పర్యవసానాలను కూడా నేతలు చర్చించనున్నారని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబరు 4-7 తేదీల్లో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ జకార్తాలో పర్యటిస్తారు. అమెరికా-ఆసియాన్ సదస్సు, తూర్పు ఆసియా సదస్సులకు ఆమె హాజరవుతారు. ఇండో-పసిఫిక్ నేతలతో చర్చలు జరుపుతారు.





'సైకిల్‌పై వెళ్లి చంద్రుడిపై దిగాం..'

చంద్రయాన్-3 విజయంపై నెటిజన్ల హర్షాతిరేకాలు

భారత అంతరిక్ష కార్యక్రమం తొలినాళ్లలో సైకిల్‌పై రాకెట్ భాగాలను తరలించిన రోజులను ఈ సందర్భంగా సోషల్ మీడియాలో యూజర్లు గుర్తు చేసుకున్నారు. ల్యాండర్ నుంచి బయటకు వచ్చిన ప్రజ్ఞాన్ రోవర్ చంద్రునిపై సమాచారాన్ని సేకరించడానికి అన్వేషణ ప్రారంభించింది. ఓ నెటిజన్ చంద్రయాన్-3 విజయంపై ట్విటర్‌లో తన సంతోషాన్ని పంచుకుంటూ 'సైకిల్ సే చాంద్ తక్ సఫర్' అని తెలిపారు. ఓటమి గెలుపుకు పునాది అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ సందర్భంగా చాలా మంది అప్పటి ఇస్రో ఛైర్మన్ కె. శివన్‌ను గుర్తుచేసుకున్నారు.





తెనాలిలో బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో చంద్రయాన్ 3 ల్యాండిగ్ చూస్తున్న విద్యార్థులు



ఇస్రో ఆకారంలో కూర్చొని శుభాకాంక్షలు తెలుపుతున్న కడియం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు

చంద్రయాన్ విజయవంతంపై హర్షం

చంద్రయాన్-3 జయప్రదంపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 అక్షరమాల ఆకారంలో, కడియంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఇస్రో ఆంగ్ల అక్షరమాలలో కూర్చొని ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.



హర్షం వ్యక్తం చేస్తున్న విజయవాడలోని ఎస్‌కెపివి హిందూ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు




చంద్రయాన్-3 ఆకారంలో తూ.గో. జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల జడ్‌పి పాఠశాల విద్యార్థులు

ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు కృషి

దక్షిణాఫ్రికా నేతతో మోడీ భేటీ

జోహాన్నెస్‌బర్గ్ : 15వ బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చిన ప్రధాని మోడీ దక్షిణాఫ్రికా అధ్యక్షులు సిరిల్ రమాఫోసాతో భేటీ అయ్యారు. బ్రిక్స్ సదస్సుకు ముందుగానే వీరి సమావేశం జరిగింది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లోని పురోగతి గురించి సమీక్షించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా గల పేద దేశాల వాణిని మరింత బలోపేతం చేసేందుకు కలిసి పని చేయడానికి గల మార్గాలను కూడా వారు చర్చించారు.



రక్షణ, వ్యవసాయం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్యం, సంరక్షణ, ప్రజల మధ్య సంబంధాలుతో సహా వివిధ రంగాల్లో సాధించిన పురోగతిని నేతలు సమీక్షించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పరస్పరం ప్రయోజనాలు కలిగిన అంశాలతో సహా బహుళ అంతర్జాతీయ వేదికలపై సమన్వయాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. జి-20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్‌కు పూర్తి మద్దతును దక్షిణాఫ్రికా నేత ప్రకటించారు. జి-20లో ఆఫ్రికన్ యూనియన్‌కు పూర్తి స్థాయి సభ్యత్వానికి భారత్ చేపట్టిన చొరవను స్వాగతించారు. సెప్టెంబరు 8-10 తేదీల్లో భారత్‌లో మొదటిసారిగా జి-20 సదస్సు జరగనుంది.

భారత్-దక్షిణాఫ్రికా సంబంధాలను మరింత పరిపుష్టం చేసే విస్తృతాంశాలను చర్చించామని, వాణిజ్యం, రక్షణ, పెట్టుబడులపై ప్రధానంగా చర్చలు సాగాయని మోడీ ట్వీట్ చేశారు. సమావేశానికి సంబంధించిన కొన్ని ఫోటోలను కూడా ఆయన పంచుకున్నారు.

ఆఫ్రికన్ యూనియన్ నుండి నైగర్ సస్పెన్షన్

నియామె : ఆఫ్రికన్ యూనియన్‌కు సంబంధించిన అన్ని సంస్థలు, కార్యకలాపాల నుండి నైగర్‌ను సస్పెండ్ చేశారు. నైగర్‌లో రాజ్యాంగ వ్యవస్థను సమర్థవంతమైన రీతిలో పునరుద్ధరించేవరకు ఈ సస్పెన్షన్ తప్పదని ఆఫ్రికన్ యూనియన్ హెచ్చరించింది. నైగర్ అధ్యక్షుడు మహ్మద్ బజూమ్‌ను పదవీచ్యుతుడిని చేసి, ఆయనను, ఆయన కుటుంబ సభ్యులను మిలటరీ గ్రూపు రాజధానిలో గృహ నిర్బంధంలో వుంచింది. మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన కొత్త మిలటరీ పాలకులు, వారి మద్దతుదారులపై ఆంక్షలు విధిస్తామని ఆఫ్రికన్ యూనియన్ హెచ్చరించింది.

మాతృభాష అధ్యయనంతో పరభాషలపై పట్టు

- ఎపి అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు

పజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

తెలుగు భాష మధురమైనదని, మాతృభాషను చక్కగా అధ్యయనం చేస్తే మిగతా భాషలను సులభముగా నేర్చుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు తెలిపారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా బుధవారం ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ, ఎఎన్‌యు తెలుగు విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా తెలుగు భాషా వికాస వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. విజయబాబు మాట్లాడుతూ.. అమ్మ భాషపై మక్కువను పెంచుకుని గిడుగు అడుగు జాడలలో నడిచి ఆ మహనీయుని ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ.. ఆత్మాభిమానాన్ని పెంచేది, ఆకలిని తీర్చేది భాష అని, తెలుగు భాషను నేడు ప్రతి ఒక్కరు అభ్యసించి పురోగతిని సాధించాలని సందేశం ఇచ్చారు. సభాధ్యక్షులుగా తెలుగు భాషా విభాగాధిపతి ఆచార్య ఇ.మాధవి వ్యవహరించారు. ఆచార్య ఎన్.వి. కృష్ణారావు రచించిన 'తెలుగు తల్లి దేశభక్తి గీతం', ఆర్కిటెక్చర్ కళాశాల ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి రచించిన 'నీడనివ్వని చెట్టు' అనే పుస్తకాలను ఆవిష్కరించారు. సదస్సులో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి .కరుణ, వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈశాన్య రాష్ట్రాల ప్రత్యేక హోదా జోలికిపోము

- సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈశాన్య రాష్ట్రాల ప్రత్యేక హోదా జోలికిపోమని, ఆ ప్రత్యేక నిబంధనలను తాకే ఆలోచన లేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. జమ్మూకాశ్మీర్‌కు తొలగించబడిన ప్రత్యేక ప్రతిపత్తికి అవి భిన్నంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వాదించింది. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడానికి 2019 కేంద్రం తీసుకున్న చర్యను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా న్యాయవాది మనీష్ తివారీ వాదనకు ప్రతిస్పందనగా కేంద్ర ప్రభుత్వం ఈ వివరణ వచ్చింది. న్యాయవాది తివారీ వాదిస్తూ స్వాతంత్ర్యానంతరం, భారతదేశం తన పరిధులను రాజ్యాంగపరమైన హామీలతో నిర్వహించాలని నిర్ణయించుకుందని, "మేము గణతంత్రాన్ని నిర్మిస్తున్నాము" అని పేర్కొందని పేర్కొన్నారు. దేశ సరిహద్దులో ఒక చిన్న భయం కూడా తీవ్రమైన చిక్కులను కలిగిస్తుందని పేర్కొంటూ, మణిపూర్‌లో 150 మందికి పైగా ప్రాణాలను బలిగొన్న హింసాకాండాను ప్రస్తావించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో

మందగించిన విద్యుత్ వాహనాల అమ్మకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచం మొత్తం సహజ పర్యావరణం దెబ్బ తింటోందని కాలుష్య నియంత్రణ కోసం ఎన్నో ప్రోత్సాహకాలతో ప్రభుత్వాలు విద్యుత్ వాహనాల (ఇవి) వినియోగం వైపు నడుస్తుంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయం కోసం తీసుకున్న చర్యలు విద్యుత్ వాహనాల తయారీదారులకే కాదు కొనుగోలుదారులకూ చుక్కలు చూపుతున్నాయి. దీంతో ఇవి అమ్మకాలు మందగించాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 40 శాతం రాయితీని 15 శాతానికి పరిమితం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి విద్యుత్ వాహనంపై 12 శాతం లైఫ్‌ట్యాక్స్‌తోపాటు త్రైమాసిక రోడ్ ట్యాక్స్‌లను వసూలు చేయాలని నిర్ణయించడంతో ఒక్కసారిగా ఇవి అమ్మకాలపై మూలిగే నక్కపై తాటికాయపడ్డట్టు అయ్యింది. విద్యుత్ వాహనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ఈ చర్యలతో తయారీదారులే కాదు, కొనుగోలుదారులూ ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం రాయితీలను తగ్గించినా దేశంలో చాలా రాష్ట్రాలు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే ప్రక్రియలో భాగంగా 2027 వరకు పన్ను రాయితీలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నాయి.

ఫలితం తేలేది టై బ్రేక్‌లోనే..

- ప్రజ్ఞానంద-కార్ల్‌సన్ రెండో గేమ్ డ్రా
- ప్రపంచకప్ చెస్ ఫైనల్



బాకు(అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ ఫైనల్లో 18ఏళ్ల రమేశ్‌బాబు ప్రజ్ఞానంద రెండోరౌండ్‌లోనూ టాప్‌సీడ్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను నిలువరించాడు. బుధవారం భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద, నార్వేకు చెందిన మాగ్నస్ కార్ల్‌సన్‌ల మధ్య జరిగిన ఫిడే ప్రపంచకప్ చెస్ ఫైనల్ రెండోరౌండ్ పోటీ 30ఎత్తుల అనంతరం డ్రాకు ఇరువురు అంగీకరించారు. క్లార్‌సన్ తెల్లపావులతో, ప్రజ్ఞానంద నల్లపావులతో నేటి గేమ్‌లను ఆడారు. గురువారం నిర్వహించే టైబ్రేక్ పోటీలు జరగనున్నా యి. ఇక మంగళవారం జరిగిన తొలి గేమ్ డ్రా కావడంతో ఇరువురు 1-1పాయింట్లతో సమంగా నిలిచారు.

టై బ్రేక్ ఇలా..

తొలి రెండు గేమ్‌లు డ్రా కావడంతో టైటిల్ విజేత ఎవరో నిర్ణయించేందుకు గురువారం నుంచి టైబ్రేక్(ర్యాపిడ్) పోటీలను నిర్వహించనున్నారు. తొలి టై బ్రేక్ 25+10 నిమిషాలతో రెండుగేమ్‌లు జరుగుతాయి. ఆ రెండు కూడా డ్రా అయిన పక్షంలో 10+10 నిమిషాలతో మరో రెండు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహిస్తారు. ఒకవేళ ఆ రెండు గేమ్‌లు కూడా డ్రా అయిన పక్షంలో 5+3నిమిషాలతో బ్రిట్జ్ పద్ధతిపై మరో రెండు గేమ్‌లను, అంతిమంగా 3+2నిమిషాలతో బ్రిట్జ్ సడెన్ డెత్‌తో విజేత ఎవరో తేలిపోనుంది. ఇంతకుముందు కార్ల్‌సన్‌తో ఐదుసార్లు తలపడిన ప్రజ్ఞానంద్ మూడుసార్లు గెలిచిన సంగతి తెలిసిందే.

ప్రి క్వార్టర్స్‌కు డబుల్స్ జోడీలు

బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్

కోపెన్‌హాగెన్(డెన్మార్క్): బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి భారత పురుషుల, మహిళల డబుల్స్ జోడీలు ప్రవేశించాయి. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జంట ప్రత్యర్థులపై సునాయాసంగా గెలిచారు. త్రీసా-గాయత్రి జంట 21-18, 21-10తో చైనీస్ తైపీకి జంటను, పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ 21-16, 21-9తో ఆస్ట్రేలియా జంటను చిత్తుచేశారు. ప్రి క్వార్టర్స్‌లో 2వ సీడ్ చిరాగ్-సాత్విక్ జంట మలేషియాకు చెందిన 6వ సీడ్ మార్టిన్-కర్నోండోతో, త్రీసా-గాయత్రి జంట టాప్‌సీడ్ చైనాకు చెందిన చెన్-యు-ఫిన్‌తో తలపడనున్నారు.

ఎపిఎల్‌లో కోస్టల్ రైడర్స్ గెలుపు

ప్రజాశక్తి -పి ఎం పాలెం (విశాఖ)

విశాఖ నగర పరిధి పిఎం.పాలెంలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఎపిఎల్ సీజన్-2 లీగ్‌లో బుధవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్- కోస్టల్ రైడర్స్ జట్లు తలపడ్డాయి. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ ప్రకారం కోస్టల్ రైడర్స్ విజేతగా నిలిచింది. తొలుత టాస్ గెలుచుకున్న కోస్టల్ రైడర్స్ ఫీల్డింగ్ ఎంచుకొని బరిలోకి దిగారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 18 ఓవర్లకు కుదించారు. దీంతో బ్యాటింగ్ తీసుకున్న రాయలసీమ కింగ్స్ జట్టు బ్యాట్స్ మ్యాన్లు 18 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 131 మాత్రమే చేయగలిగారు. కెహెచ్ వీరారెడ్డి మాత్రమే 78 పరుగులు చేసి రాయలసీమ కింగ్స్ జట్టులో స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. మిగతా వారంతా రాణించలేక పోయారు.అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన కోస్టల్ రైడర్స్‌కు 15 ఓవర్లలో 127 పరుగులకు కుదించడంతో బ్యాట్స్ మ్యాన్‌లు 14 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఓపెనర్ బ్యాట్స్ మ్యాన్ ఎం ప్రణీత్ 40 బంతుల్లో మూడు సిక్స్‌లు, ఆరు ఫోర్లుతో 64 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలిచాడు. ప్రణీత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్





చంద్రయాన్-3 విజయవంతంతో క్రికెటర్ల ఆనందోత్సవాలు

డంబ్లిన్: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ఐర్లాండ్ పర్యటనలో ఉన్న టీమిండియా క్రికెటర్లు ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు. ల్యాండర్ జాబిల్లిపై దిగే ఉత్కంఠ క్షణాలను టీవీ ముందు నిల్చొని ఆసక్తిగా తిలకించారు. విజయవంతంగా ల్యాండర్ చంద్రునిపై దిగడంతో ఆటగాళ్లు హర్షధ్వానాలు తెలియజేశారు. ఇక భారత్-ఐర్లాండ్ జట్ల మధ్య జరగాల్సిన మూడో, చివరి టి20 వర్షం కారణంగా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. దీంతో మూడు టి20ల సిరీస్‌ను భారత్ 2-0 చేజిక్కించుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68